## 'ఎస్సీ వర్గీకరణ అమలు అడ్డుకుంటాం'



నల్గొండ: సభలో అభివాదం చేస్తున్న వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు

నీలగిరి, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ అమలుకు సీఎం ఎలాంటి చర్యలు తీసుకున్నా మాలల ఉసురులను బిగించుకుని అడ్డుకుంటామని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర చైర్మన్ చెన్నయ్య సూచించారు. వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి బస్సు యాత్ర సోమవారం నల్గొండ పట్టణానికి చేరుకున్న సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. టీఎన్జీవో భవన్‌లో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ఎస్సీలకు రిజర్వేషన్లు పెంచి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ కులగణన చేపట్టాలన్నారు. ప్రభుత్వ పథకాలను ఎవరు ఎక్కువ లబ్ధి పొందారో పరిశీలించాలన్నారు. కలిసి ఉన్న దళితులను విడదీయడం కోసం సీఎం చేస్తున్న కుట్రలను అడ్డుకుంటామన్నారు. మాలల ప్రాతినిధ్యంలేని మంత్రి వర్గ ఉపసంఘాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సభలో సమితి నాయకులు తాళ్లపల్లి రవి, ఆకుమాల మధుబాబు, చెరుకు రాంచందర్, మేక వెంకన్న, బుర్గల వెంకటేశ్వర్లు, రమేశ్, లింగస్వామి, శ్రీను పాల్గొన్నారు.

## గోదాముల పరిశీలన



గోదాములను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

కనగల్, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని గోదాములను అదనపు కలెక్టర్ శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కానుండటంతో సన్న ధాన్యం నిల్వకు ఈ గోదాములను ఉపయోగించుకోనున్నారు. అందులో భాగంగా అందులో ఉన్న ధాన్యం, ప్రస్తుత నిల్వ సామర్థ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీఎం హరీశ్, తహసీల్దార్ పద్మ, ఆర్ఐ సునీత, ఏఆర్ఓ గిరి తదితరులు పాల్గొన్నారు.


# ఈనాడు నల్గొండ

మంగళవారం అక్టోబరు 15, 2024




# ఆర్టీసీ ప్రత్యేక బాదుడు

**○ అన్ని బస్సుల్లో 50 శాతం అదనపు వసూళ్లు**



మిర్యాలగూడలో కోదాడ బస్సులో సీటు కోసం పోటీపడుతున్న ప్రయాణికులు

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

దసరా పర్వదినం సందర్భంగా ఆర్టీసీ సంస్థ ప్రయాణికుడి జేబుకు చిల్లులు పెడుతోంది. ప్రత్యేక(స్పెషల్) బస్సుల పేరిట అకస్మాత్తుగా ఛార్జీలు పెంచేసింది. పండగకు ముందు 25 శాతం అదనంగా వసూలు చేయడం ప్రారంభించింది. ఇక తిరుగు ప్రయాణంలో మరింత ముందడుగు వేసి ఏకంగా 50 శాతం అదనంగా వసూలు చేస్తోంది. నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లోని ఏడు డిపోల పరిధిలో హైదరాబాద్ సహా పలు ప్రాంతాలకు మొత్తం 646 ప్రత్యేక బస్సులు నడుస్తున్నాయి. అన్ని రూట్లలోనూ టికెట్ ధర పెంచి వసూలు చేస్తుండటంతో ప్రయాణికులు లబోదిబోమంటున్నారు.

### పల్లెవెలుగు టిక్కెట్లు రద్దు

దసరా పండగకు వచ్చి తిరిగి వెళ్లే ప్రయాణికులతో ఉమ్మడి నల్గొండ జిల్లాలోని ఆర్టీసీ బస్టాండ్లు సోమవారం కిక్కిరిసిపోయాయి. ప్రయాణికుల రద్దీని చూసి ఇదే అదనుగా భావించిన సంస్థ యాజమాన్యం పల్లెవెలుగు బస్సుల్లోనూ ఎక్స్‌ప్రెస్ ఛార్జీలు వసూలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో అన్ని రూట్లలో పల్లెవెలుగు బస్సులన్నింటిలోనూ ఎక్స్‌ప్రెస్ ఛార్జీలు తీసుకుంటున్నారు. పండగ వేళ ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా చూసుకోవాల్సిన ఆర్టీసీ సంస్థ టికెట్ వెల పెంచడంపై సర్వత్రా తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. కొన్ని పల్లెవెలుగు బస్సులకు ఎక్స్‌ప్రెస్ బోర్డుతో పాటు ప్రత్యేకం బోర్డు పెట్టి మరింత అదనంగా దండుకుంటున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

### సాధారణ ఛార్జీల్లేవు..

బతుకమ్మ, దసరా పండగల సందర్భంగా ఈ నెల 2 నుంచి 16 వరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. తొలుత సాధారణ ఛార్జీలు తీసుకుంది. ఆ తర్వాత 25 శాతం అదనంగా వసూలు చేయడం మొదలు పెట్టి ప్రస్తుతం 50 శాతం అదనంగా వసూలు చేస్తోంది. సాధరణ టిక్కెట్ ధరపై మరో సగం ఛార్జీ అదనంగా చెల్లించాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. కేవలం ప్రత్యేక బస్సుల్లో మాత్రమే అదనపు ఛార్జీ వసూలు చేస్తున్నప్పటికీ.. అన్ని బస్సులకు ప్రత్యేకం బోర్డులు తగిలించారని.. సాధారణ బస్సులు అసలు నడపడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ధరలు పెంచారిలా...**

| రూట్ | బస్సు | సాధారణ ఛార్జీ (రూ.లలో) | ప్రత్యేక ఛార్జీ (రూ.లలో) |
|---|---|---|---|
| మిర్యాలగూడ–హైదరాబాద్ | సూపర్‌లగ్జరీ | 290 | 400 |
| సూర్యాపేట– హైదరాబాద్ | ఎక్స్‌ప్రెస్ | 200 | 290 |
| నల్గొండ– హైదరాబాద్ | డీలక్స్ | 180 | 260 |
| కోదాడ–హైదరాబాద్ | ఎక్స్‌ప్రెస్ | 290 | 410 |
| మిర్యాలగూడ– హాలియా | పల్లెవెలుగు | 30 | 50 |
| నల్గొండ–మిర్యాలగూడ | పల్లెవెలుగు | 60 | 110 |

(పల్లెవెలుగు బస్సుకు ఎక్స్‌ప్రెస్ పేరుతో సూపర్ లగ్జరీ ఛార్జీ వసూలు చేశారు)

**ఉమ్మడి జిల్లాలో డిపోల వారీగా ప్రత్యేక బస్సుల వివరాలు..**




| డిపో | ప్రత్యేక బస్సులు | తిరుగు ప్రయాణంలో |
|---|---|---|
| నల్గొండ | 74 | 30 |
| యాదగిరిగుట్ట | 59 | 32 |
| నార్కట్‌పల్లి | 37 | 12 |
| దేవరకొండ | 62 | 32 |
| మిర్యాలగూడ | 84 | 34 |
| కోదాడ | 45 | 14 |
| సూర్యాపేట | 87 | 37 |

### ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే..

– రాజశేఖర్, ఆర్టీసీ ఆర్ఎం, నల్గొండ

దసరా సందర్భంగా నడుపుతున్న ప్రత్యేక బస్సులు తిరుగు ప్రయాణంలో ఖాళీగా వస్తున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక బస్సుల్లో 50 శాతం అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్నాం. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అందుబాటులో ఉంది.

# యాసంగి పంట ప్రణాళిక ఖరారు



వరి సాగు


నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: నల్గొండ జిల్లాలో యాసంగి పంటల సాగునకు సంబంధించి వ్యవసాయశాఖ కార్యాచరణ ప్రణాళిక ఖరారు చేసింది. 2024-25లో 5,83,620 ఎకరాల్లో రైతులు సాగు చేస్తారని అంచనా వేసింది. ఈ మేరకు అవసరమైన ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచింది. జిల్లాలో 90 శాతం చెరువులు, సాగర్, మూసీ, జలాశయాలు వర్షాకాలంలో పూర్తిగా నిండాయి. ఈ నేపథ్యంలో భూగర్భ జలమట్టం పెరిగింది. బోర్లు, బావుల్లో సాగుకు సరిపోను నీరు లభిస్తుంది. ఈ సందర్భంగా ఏ మండలంలో ఎన్ని ఎకరాల్లో పంటలు సాగు చేస్తారనే విషయంలో నిర్దేశిత లక్ష్యాన్ని అధికారులు రూపొందించారు.

**జిల్లాకు కావాల్సిన విత్తనాలు క్వింటాళ్లలో..**

| పంట | కావాల్సిన విత్తనాలు |
|---|---|
| వరి | 1,39,230 |
| మినుము | 80 |
| పెసర | 160 |
| వేరుసెనగ | 22,059 |

### విత్తనాలు సిద్ధం..

– పాల్వాయి శ్రవణ్ కుమార్, జిల్లా వ్యవసాయాధికారి, నల్గొండ



యాసంగిలో పంటల సాగుకు అనుకూల వాతావరణం ఉంది. సమృద్ధిగా వర్షాలు కురవడంతో బోర్లు, బావుల్లో నీటి మట్టాలు పెరిగాయి. అన్ని రకాల విత్తనాలు సిద్ధంగా ఉన్నాయి.

**యాసంగి సాగు విస్తీర్ణం ఎకరాల్లో..**

| సాగు చేసే పంట | 2023 సాగు | 2024 సాగు అంచనా |
|---|---|---|
| వరి | 4,20,523 | 5,56,920 |
| జొన్న | 83 | 150 |
| సజ్జ | 1,851 | 2,200 |
| వేరుశసెనగ | 18,288 | 21,000 |
| పెసర | 1,953 | 2,000 |
| ఇముదం | 281 | 350 |
| మినుము | 517 | 1,000 |

### రాయితీ లేదు..

ఎక్కువగా సాగు చేసే వరితో పాటు వేరుశనగ, మినుము, పెసర, ఆముదం, జొన్న, సజ్జ విత్తనాలకు ప్రభుత్వం రాయితీ ఇంత వరకు ప్రకటించలేదు. దీంతో ప్రయివేటు వ్యాపారుల వద్ద కొనాల్సి వస్తోంది. వారు ఇష్టం వచ్చిన ధరకు విక్రయించే అవకాశం ఉంది.

### వరి సాగునే అధికంగా..

జిల్లాలో సాగుకు భూములు అనుకూలంగా మారాయి. ప్రాజెక్టుల, బోరు బావుల కింద వరి సాగుకు మొగ్గు చూపుతున్నారు. అధికారులు మాత్రం ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచనలు చేస్తున్నారు. నల్గొండ నియోజకవర్గంలోనే ముందస్తుగా వానాకాలం వరి కోతలు ప్రారంభించారు. మిగిలిన నియోజకవర్గాల్లో నవంబరు, డిసెంబరులో వరి కోతలు మొదలవుతాయి. ఎక్కడ ముందస్తుగా కోతలు మొదలవుతాయో అక్కడ విత్తనాలు సిద్ధంగా ఉంచేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని సంబంధిత అధికారులు తెలిపారు.

## గుర్తింపు వచ్చేలా పనిచేయండి: ఎస్పీ

నల్గొండ నేరవిభాగం, న్యూస్‌టుడే: ప్రతి ఫిర్యాదు దారుడికి తగిన న్యాయం చేస్తూ పోలీస్ శాఖకు మరింత గుర్తింపు వచ్చేలా పనిచేయాల్సిన అవసరం ఉందని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొంత మంది సమస్యలు సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడి పరిష్కార మార్గం చూపారు. భూ సమస్యల పరిష్కారాలు రెవెన్యూ అధికారుల సహకారంతో పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## 17న సీఎం కప్ టార్చ్‌ర్యాలీ

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: సీఎం కప్-2024 టార్చ్ ర్యాలీని ఈనెల 17న నల్గొండలోని మర్రిగూడ బైపాస్‌రోడ్ నుంచి క్లాక్ టవర్ వరకు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి సిహెచ్.విష్ణుమూర్తిగౌడ్ తెలిపారు. సాయంత్రం 4గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ఐటీఐలో ప్రవేశాలు

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: నల్గొండలోని ప్రభుత్వ ఐటీఐ(ఓల్డ్) నందు కొత్తగా ప్రారంభించబడిన అడ్వాన్స్ కోర్సుల్లో సీట్ల కోసం వాక్ ఇన్ అడ్మిషన్‌కు నోటిఫికేషన్ జారీచేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎ.నర్సింహాచారి ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణత కలిగిన విద్యార్థులు ఐటీఐ.తెలంగాణ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకొని, ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో ప్రభుత్వ ఐటీఐ కళాశాల నల్గొండ నందు హాజరుకావాలని కోరారు. గత ఆరు ఫేజ్‌లలో సీట్లు పొందని అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

రైతేరాజు 6లో..

# సమగ్ర కులగణనకు కసరత్తు




ఈనాడు, నల్గొండ:

సమగ్ర కులగణన చేపట్టేందుకు నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఒకట్రెండు రోజుల్లో మార్గదర్శకాలు వెలువడనున్నాయని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ భారీ క్రతువును రెండు నెలల్లో పూర్తి చేయాలని సర్కారు భావిస్తోంది. ఈ దిశగా మూడు జిల్లాల ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి సిబ్బందిని కార్యోన్ముఖులను చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ సమయంలో గత భారాస ప్రభుత్వం 2014లో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించింది. జనాభా దామాషా ప్రకారం ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు ఉండాలని గత కొన్నాళ్ల నుంచి బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో పదేళ్ల అనంతరం మరోసారి సమగ్ర కులగణన చేపట్టనుండటం విశేషం.

### సమగ్ర వివరాల సేకరణ

కులగణనలో క్షేత్రస్థాయి సిబ్బంది ప్రతి కుటుంబం కులంతో పాటు వారి ఆర్థిక, సామాజిక, రాజకీయ స్థితిగతులు, విద్యా, ఉద్యోగం తదితర పరిస్థితులను సేకరించనున్నారు. వీటన్నింటినీ క్రోడీకరించి సమగ్ర నివేదికను జిల్లాల వారీగా ప్రభుత్వానికి నివేదించనున్నారు. బీసీల్లోని ఉపకులాలను సైతం ఈ సర్వేలో పొందుపరచనున్నారు. దీని ద్వారానే రానున్న పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లు, స్థానిక సంస్థల్లో బీసీల కోటాను నిర్ధారించనున్నారు.

**పదేళ్ల క్రితం ఉమ్మడి జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వేలో కులాల వారీగా జనాభా వివరాలు**

| | |
|---|---|
| మొత్తం జనాభా : | 35,99,237 |
| ఎస్సీ : | 6,98,894 |
| ఎస్టీ : | 4,30,956 |
| బీసీ : | 19,47,459 |
| ఓసీ : | 5,21,928 |
| మైనార్టీ : | 2,29,662 |

### రాజకీయ అవకాశాలు లభిస్తాయని..

◆ ప్రస్తుతం మూడు జిల్లాల్లోనూ మొత్తం జనాభాలో సుమారు 52 శాతం బీసీ జనాభా ఉంది. ఉమ్మడి జిల్లాలో అనాదిగా ఆధిపత్య వర్గాల అండ లేకపోవడంతో బీసీలకు రాజకీయంగా సరైన ప్రాధాన్యం దక్కడం లేదని ఏళ్ల నుంచి ఆయా సంఘాలు విమర్శిస్తున్నాయి. ఈ సర్వే ద్వారా బీసీ లెక్క తేలితే దాని ఆధారంగా రాజకీయ అవకాశాలు లభిస్తాయని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

◆ నోడల్ ఏజెన్సీగా ఉన్న ప్రణాళిక శాఖలో తగినంత సిబ్బంది లేకపోవడంతో ఈ సర్వే జరిగే రెండు నెలల పాటు ఇతర శాఖల నుంచి పలువురిని డిప్యుటేషన్ మీద తీసుకోనున్నట్లు తెలిసింది. సర్కారు నుంచి మార్గదర్శకాలు విడుదలైన వెంటనే క్షేత్రస్థాయిలో పని మొదలుపెట్టాలని ఇప్పటికే ఉన్నతాధికారులకు ఆదేశాలు అందాయి. ఈ నేపథ్యంలో ఒకట్రెండు రోజుల్లో దీనిపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఉన్నతాధికారులు దిశానిర్దేశం చేయనున్నట్లు సమాచారం.

## గుర్రంపోడు ఎస్సైపై సస్పెన్షన్ వేటు

గుర్రంపోడు, న్యూస్‌టుడే: గుర్రంపోడు ఎస్సై నారాయణరెడ్డిని సస్పెండ్ చేస్తూ మల్టీజోన్-2 ఐజీపీ సత్యనారాయణ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ముల్కలపల్లిలో ఆగస్టు 29న వివాహిత జాల రజిత తన ఇంట్లో అనుమానాస్పదస్థితిలో మృతిచెందిందన్న సమాచారంతో ఎస్సై సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఆమె భర్త అంజయ్య ఫిర్యాదుతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహంపై గాయాలుండటమే కాక కారంపొడి ఉండటంతో ఇది హత్యేనని ఆమె భర్తతో పాటు బంధువులు నిందితుల పేర్లతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సెప్టెంబరు 4న దర్యాప్తు అనంతరం అనుమానాస్పద మృతి (194 బీఎన్ఎస్) నుంచి ఆత్మహత్యకు ప్రేరేపించినట్లు (108 బీఎన్ఎస్) కేసు మార్చి నమోదు చేశారు. రజిత ఆత్మహత్యకు ప్రేరేపించిన జాల రాములుని ఏ1గా గుర్తించి సెప్టెంబరు 9న అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. హత్య కేసును నీరుగార్చి ఆత్మహత్యగా మార్చారంటూ మృతురాలి బంధువుల నుంచి నిరసన వ్యక్తమైంది. పోలీసులు లంచం తీసుకుని నిందితులను వదిలిపెట్టారని సామాజిక మాధ్యమాల్లో వైరలవడంతో స్పందించిన ఎస్పీ శరత్‌చంద్ర పవార్ విచారణకు ఆదేశించారు. మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నివేదికను అందజేశారు. ఈ నివేదిక ప్రకారం.. ఈ హత్యకేసులో బాధ్యతారాహిత్యంగా దర్యాప్తు చేశారన్న ఆరోపణలపై నల్గొండ ఎస్పీ ఇచ్చిన నివేదికను అనుసరించి సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. నిందితులతో కుమ్మక్కయి ఏ2 పార్వతమ్మ, ఏ3 జాల వెంకటయ్యలను పేర్కొనకుండా కానిస్టేబుల్ ద్వారా రూ.లక్ష లంచం తీసుకుని పోలీసుశాఖ ప్రతిష్ఠకు మచ్చ తెచ్చినందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎస్పీ నివేదిక ఆధారంగా మరోసారి విచారణ జరిపిన తగిన చర్యలు తీసుకుంటామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఐ, కానిస్టేబుళ్లపై కూడా చర్యలు ఉండవచ్చని సమాచారం.

# ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలి: కలెక్టర్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

నల్గొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం వివిధ అంశాలపై జిల్లా అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. గతంలో ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు ఇచ్చి బ్యాంకు మార్టిగేజ్ నుంచి రిలీజ్ అయిన పట్టాలను మండలాలు, గ్రామాల వారిగా జాబితా రూపొందించి సిద్ధంగా ఉంచాలన్నారు. పది రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి కావాలన్నారు. ఈ విషయంపై ప్రత్యేక అధికారులు ఈ నెల 16న వారి మండలాలకు వెళ్లి పర్యవేక్షించాలన్నారు. జిల్లాలో వెంటనే నిర్దేంచిన చోట ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలన్నారు. రెండు పడకగదుల ఇళ్ల నిర్మాణం పూర్తయిన చోట లబ్ధిదారుల జాబితాను పారదర్శకంగా రూపొందించాలని ఆదేశించారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కరించాలని సూచించారు.

**కంట్రోల్ రూమ్ ప్రారంభం.. నల్గొండ కలెక్టరేట్:** వానాకాలం ధాన్యం సేకరణపై ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ బాగా పని చేయాలని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. సోమవారం ఆయన వానాకాలం ధాన్యం సేకరణకు సంబంధించి సమాచారం, ఫిర్యాదుల స్వీకరణకు జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను ప్రారంభించారు. ధాన్యం కొనుగోలులో ఏవైనా సమస్యలు తలెత్తితే రైతులు ఈ కంట్రోల్ రూమ్‌లో 24 గంటలు పని చేసే చరవాణి నెంబర్ 9963407064కు ఫోన్ చేసి తెలియచేయవచ్చని కలెక్టర్ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పని చేసే విధంగా రెండు విడతల్లో విధులు నిర్వహించేలా సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. రాష్ట్ర స్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారని. టోల్ ఫ్రీ నంబర్ 1967 లేదా 18004250033 ఫోన్ చేసి తెలియచేయవచ్చని వివరించారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్, డీఎస్వో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించండి

నల్గొండ గ్రామీణం: పశువులకు ఈ సీజన్‌లో పశుసంవర్ధకశాఖ ద్వారా వేసే గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని పెంపకందారులకు కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. నల్గొండలో సోమవారం గోడపత్రికలను ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లాలో తెల్ల పశువులు 2,15,869, గేదె జాతి 3,17,279 ఉన్నట్లు వివరించారు. వీటి కోసం ఏర్పాటు చేసిన 78బృందాల ద్వారా టీకాల కార్యక్రమం జరుగుతుందన్నారు. మూడు నెలల వయస్సు పైబడిన అన్ని పశువులకు టీకాలు వేస్తారని తెలిపారు. వచ్చే నెల 14వ తేదీ వరకు టీకాలు వేస్తారని వివరించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటరెడ్డి, జిల్లా ఏడీ మల్లికార్జున్ పాల్గొన్నారు.

**వేగవంతం చేయాలి.. నల్గొండ కలెక్టరేట్:** పట్టణ స్థాయిలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. సోమవారం ఎల్ఆర్ఎస్, ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు, రెండు పడకగదుల ఇళ్ల లబ్ధిదారుల గుర్తింపు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుపై సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కొండమల్లేపల్లి వంటి గ్రామీణ మండలంలో వెయ్యి ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించడం జరిగిందని వారిని స్ఫూర్తిగా తీసుకుని పట్టణాల్లో దరఖాస్తుల వేగం పెంచాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు.




నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే:

సర్కారు బడులకు కొత్త ఉపాధ్యాయులు వచ్చి సపాఠం చెప్పనున్నారు. డీఎస్సీ-2024 ద్వారా ఉపాధ్యాయ కొలువులకు ఎంపికైన అభ్యర్థులకు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఇప్పటికే హైదరాబాద్‌లో ఉత్తర్వులు అందుకున్న అభ్యర్థులకు కౌన్సెలింగ్ ద్వారా పాఠశాల కేటాయించనున్నారు. కొత్తవారి రాక సర్కారు బడుల్లో కొంత మేర ఉపాధ్యాయుల కొరత తీరనుంది. నల్గొండ జిల్లాలో 605, సూర్యాపేట జిల్లాలో 386, యాదాద్రి భువనగిరి జిల్లాలో 277 ఖాళీలను భర్తీ చేయడానికి నోటిఫికేషన్ జారీచేసింది. ఫలితాలు వెలువడిన తర్వాత ధ్రువపత్రాలు పరిశీలించి 1:1 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేశారు. వీరికి హైదరాబాద్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. దసరాకు ముందు కొలువుల ఉత్తర్వులు పొందినా ఎక్కడ పోస్టింగ్ అనే విషయం కొలిక్కిరాలేదు. పోస్టింగ్ కోసం జిల్లా విద్యాశాఖ మంగళవారం ప్రత్యేకంగా కౌన్సెలింగ్ నిర్వహించనుంది.

### ప్రాథమిక పాఠశాలలకు ఊరట

ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలలకు కాస్త ఊరట కలగనుంది. ఇటీవల పదోన్నతులు, బదిలీలు చేపట్టిన తరువాత ప్రాథమిక పాఠశాలల్లో ఎస్జీటీల కొరత కాస్త ఎక్కువగా ఉంది. బదిలీ జరిగిందని సంతోషం ఉన్నా అక్కడ ఉపాధ్యాయులు లేక కొన్నిచోట్ల రిలీవర్‌లు లేక అదే స్థానంలో కొనసాగుతున్నారు. తాజాగా కొత్త ఉపాధ్యాయుల నియామకం అవుతుండటంతో అలాంటి వారికి కాస్త ఉపశమనం కలుగనుంది.

### అభ్యర్థులందరూ హాజరుకావాలి

– భిక్షపతి, డీఈవో, నల్గొండ

డీఎస్సీ-2024లో ఎంపికయి, జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో రిపోర్టు చేసిన అభ్యర్థులందరికీ ఈ నెల 15న (మంగళవారం) ఉదయం 10 గంటల నుంచి నల్గొండలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం. అభ్యర్థులందరూ రెండు తాజా పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, వాస్తవ ధ్రువపత్రాలతో హాజరుకావాలి. బదిలీ అయిన ఉపాధ్యాయులు కొంత మంది అదే పాఠశాలలో కొనసాగుతూ విధులు నిర్వహిస్తున్నారు. వారు మంగళవారం సాయంత్రం విధుల నుంచి విడుదలై 16వ తేదీన బదిలీ స్థానంలో రిపోర్టు చేయాలి.

## డిగ్రీ, పీజీ కళాశాలల నిరవధిక బంద్

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఉమ్మడి జిల్లా ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్య సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన కళాశాలల బంద్ కార్యక్రమం సోమవారం నుంచి ప్రారంభమైంది. మొదటి రోజున నల్గొండ జిల్లా కేంద్రంలోని పలు కళాశాలల వద్ద యాజమాన్య సంఘం ప్రతినిధులు, అధ్యాపకులు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మారం నాగేందర్ రెడ్డి మాట్లాడుతూ గత మూడేళ్లుగా ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు విడుదల చేయకపోవడంతో అష్టకష్టాలు పడుతున్నామని పేర్కొన్నారు. కళాశాలల భవనాల అద్దెలు, కరెంట్ బిల్లులు, అధ్యాపకులకు వేతనాలు చెల్లించలేక నానా అవస్థలు ఎదుర్కొంటున్నామని తెలిపారు. కళాశాలల మనుగడ కొనసాగించాలంటే, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలంటే ప్రభుత్వం తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బంద్‌లో భాగంగా ప్రతి రోజు నిరసన కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టనున్నట్లు తెలిపారు. సంఘం ఈసీ సభ్యులు రామ్మోహన్, నర్సింహ్మారెడ్డి, జానయ్య, అధ్యాపకులు సంపత్, అశోక్, నగేశ్, పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సంఘం అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి, తదితరులు

## పత్తిలో గులాబీ రంగు లక్షణాలు, నివారణ

త్రిపురారం, న్యూస్‌టుడే: పత్తిలో గులాబీ రంగు లక్షణాలు, నివారణ గురించి కంపసాగర్ కేవీకే పీసీ శ్రీనివాసరావు తెలియజేశారు. తల్లి పురుగు లేత ఆకుల అడుగు



భాగాన లేత కొమ్మలు పూమొగ్గలు, లేత కాయలు, రక్షక పత్రాల పైన గుడ్లను గుంపులుగా, విడివిడిగా పెడుతుంది. గుడ్ల నుంచి బయటికి వచ్చిన కంటికి కనిపించని చిన్న లార్వాలు పూమొగ్గలలోకి తొలుచుకుని పువ్వు లోపలి పదార్థాలను తిని వీటిని గుడ్డి పూలుగా మారుస్తాయి. చిన్న లార్వాలు కాయలపై కన్నంచేసి నంత చిన్న రంధ్రాలను చేసి లోపలికి ప్రవేశిస్తాయి. తరువాత కాయలకు చేసిన రంధ్రం పూడిపోయి పురుగు కాయలోనే ఉండి గింజలను తింటూ దూదిని బాగా నష్టపరుస్తుంది. దూది రంగు, నాణ్యత పూర్తిగా దెబ్బతింటుంది. పురుగు లార్వా దశ మొత్తం కాయలోనే గడుపుతుంది కాబట్టి పంటకు కలిగే నష్టాన్ని తరువాత మాత్రమే గుర్తించగలం. పురుగు ఆశించిన కాయలు పూర్తిగా వృద్ధి చెందక త్వరగా పక్వానికి వస్తాయి. గులాబీ రంగు పురుగు వల్ల జరిగే నష్టం పైకి కనపడదు. కాయలను పగలిస్తేనే మాత్రమే తెలుస్తుంది. ఎందుకంటే గుడ్ల నుంచి వెలువడిన వెంటనే చిన్న లార్వాలు మొగ్గలపైన, కాయల పైన కంటికి కనిపించని సన్నని రంధ్రాలను చేస్తుంది. దీని నివారణకు సమగ్ర యాజమాన్య పద్ధతులను అనుసరించాలని ఆయన తెలిపారు.

# నాటు కోళ్ల పెంపకం.. లాభదాయకం

రైతేరాజు

చందురూరు, న్యూస్‌టుడే: కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా పదో తరగతిలోనే చదువు మానేసి తన సొంత కాళ్లపై తాను నిలబడాలని ఉన్న ఊరిలో తన సొంత భూమిలో వ్యవసాయంతో పాటు నాటు కోళ్ళ పెంపకం చేపడుతూ స్వయం ఉపాధి పొందుతూ చుట్టు పక్కల వారికి ఆదర్శంగా నిలుస్తున్నాడు చందురూరు మండలం పడమటితాళ్ల గ్రామానికి చెందిన జిల్లా రాజీవ్. ఏడేళ్ల పాటు ఆటోమొబైల్ దుకాణం నడిపించి. పోటీ ప్రపంచంలో దుకాణం నిర్వహించడం కష్టంగా భావించి వ్యవసాయ అనుబంధ రంగాలలో రాణిస్తున్న అనుభవజ్ఞుల సలహాలు, సూచనల మేరకు నాటు కోళ్ళ పెంపకం చేపడుతూ అధిక లాభాలు గడిస్తున్న రాజీవ్ తన అనుభవాన్ని తెలియపరిచారిలా..



నాటు కోళ్లకు దాణా వేస్తున్న రాజీవ్

### ఆరు నెలల్లో వెయ్యి కోళ్లను విక్రయించా..

నాటు కోళ్లకు డిమాండ్ బాగుండటంతో ఆరు నెలల్లోనే వెయ్యి నాటుకోళ్లను పూర్తిగా విక్రయించాను. ఈ కారణం దృష్ట్యానే షెడ్డు సామర్థ్యాన్ని పెంచి ప్రతి రోజు వినియోగదారులకి కోళ్ళ అందుబాటులో ఉండే విధంగా ప్రణాళిక ఏర్పాటు చేసుకుని బ్యాంక్ రుణం కోసం అర్జీ పెట్టుకున్నాను. రుణం మంజూరు కాగానే షెడ్డుని విస్తరించి కోళ్ళ పెంపకాన్ని పెంచేవాడ తాను. ఇప్పటికే విక్రయించిన తొలి బ్యాచ్ తోనే షెడ్డు నిర్మాణానికి ఖర్చు చేసిన డబ్బులు సమకూరటంతో పాటు సుమారు రూ.60వేల వరకు లాభం వచ్చింది.

### రూ.5 లక్షలతో షెడ్డు నిర్మాణం..

నాలుగెకరాల వ్యవసాయ భూమిలో మూడెకరాలు పత్తి సాగు, అర ఎకరంలో నాటు కోళ్లను పెంచేందుకు రూ.5లక్షల వ్యయంతో చుట్టూ గ్రానైట్ కడీలు అమర్చి కంచె లోపల వెయ్యి నాటు కోళ్ల సామర్థ్యం కలిగిన షెడ్డును ఏర్పాటు చేశాను. భద్రత దృష్ట్యా సీసీ కెమెరాలను అమర్చి గుర్తు తెలియని వ్యక్తులు షెడ్డు పరిసర ప్రాంతాలలో వస్తే సైరన్ వచ్చే విధంగా ఏర్పాటు చేసుకున్నాను. కర్ణాటక నుంచి అసిలి జాతికి చెందిన ఒక్క రోజు నాటు కోడి పిల్లలను ఒక్కోటి రూ.45 చొప్పున కొనుగోలు చేసి నాలుగు నెలల పాటు వాటిని పెంచుతూ ఒక్కో కోడి రెండు కిలోల బరువు కాగానే చుట్టు పక్కల గ్రామాల వారికి కిలోకి రూ.350 నుంచి రూ.400 వరకు విక్రయిస్తున్నాను. పెట్టుబడిగా ఒక్క కోడిపిల్లకు, దాణాకు కలిపి రూ.160 ఖర్చవుతుంది.

### వెదజల్లె పద్ధతిలో వరిలో కలుపు నివారణ



త్రిపురారం, న్యూస్‌టుడే: వరిలో వెదజల్లె పద్ధతిలో వెడల్పాకు కలుపు నివారణకు నాటిన 25, 30 రోజులకు 2.4-డి సోడియం సాల్ట్‌ను ఎకరాకు 500, 600గ్రా 2.4 డి 125-1.50 లీటర్లను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. గడ్డి జాతి, వెడల్పాకు కలుపు నివారణకు బిస్‌పైరిఫాస్ సోడియాన్ని ఎకరాకు 100 మీ.లీ. అనగా లీటరు నీటికి 0.5 మీ.లీ. మందును లీటరు నీటికి కలిపి 15, 20 రోజుల మధ్య పిచికారీ చేసుకోవాలి. వరి వెదజల్లె ముందు పొలంలో తుంగ, గరిక, దర్భగడ్డి, బొంత, ఊద వంటి మొండి జాతి కలుపు మొక్కలు ఎక్కువగా ఉన్నప్పుడు తొలకరి వర్షాలు పడి, కలుపు ఏపుగా పెరుగుతున్నప్పుడు లీటరు నీటికి 5 మీ.లీ. పాక్వాట్ 24 శాతం రసాయనాన్ని, గ్లైపోసినేట్ 13.5 శాతం ద్రావకం 4 మీ.లీ.లను ఒక లీటరు నీటికి కలిపి ఎక్కడ కలుపు ఉంటే అక్కడ పిచికారీ చేయాలి. ఈ మందు స్ప్రే చేసిన 10, 15 రోజుల తరువాత వరి వెదజల్లుకోవచ్చు. వెదజల్లిన 1, 2 రోజుల లోపు తేమ ఉన్నప్పుడు ఎకరాకు లీటరు పెండిమిథాలిన్ 30 శాతం (స్టాంప్, పెండిస్టార్) 700 మీ.లీ. పెండిమిథాలిన్ 38.7 శాతం ద్రావకం, 400 మీ.లీ. ప్రెటిలాక్లోర్ 50 శాతం (రిఫిట్, ఎరేజ్) 200 లీటర్ల నీటిలో కలిపి స్ప్రే చేయాలి. ఈ విధంగా వరిలో వెదజల్లె పద్ధతిలో కలుపు నివారించవచ్చు.

## సమస్య - సమాధానం

**వేరుసెనగలో విత్తన శుద్ధి గురించి తెలపండి.**

– రామయ్య, నల్గొండ

సమాధానం: కిలో విత్తనానికి 1గ్రా. టెబ్యుకొనజోల్, 3గ్రా. మాంకోజెబ్ పొడి మందును పట్టించాలి. కాయ కుళ్లు వైరస్ తెగులు ఆశించే ప్రాంతాల్లో ఒక మి.లీ. ఇమిడాకోల్ప్రిడ్ 600 ఎఫ్ఎస్‌ను 2 మీ.లీ. నీటిలో కలిపి ఒక కిలో విత్తనానికి పట్టించి విత్తనశుద్ధి చేసుకోవాలి.

**పత్తిలో పచ్చదోమ లక్షణాలు, నివారణ గురించి తెలపండి.**

– వెంకటేశ్వర్లు, హాలియా

సమాధానం: పత్తిలో పచ్చదోమ లక్షణాలు పిల్ల, తల్లి పురుగులు ఆకు అడుగు భాగాన చేరి ఆకుల నుంచి రసాన్ని పీల్చుతాయి. ఆకులు మొదట దోనెలుగా ముడుచుకుని లేత పసుపు రంగులోకి మారి ఆ తరువాత ఆకుల అంచుల నుంచి ఎర్రబడి క్రమేపి ఎండి రాలిపోతాయి. దీని నివారణకు కాండానికి మందు పూసే పద్ధతిని పాటించాలి. 30, 45 రోజులల్లో మోనోక్రోటోఫాస్‌ను 1:4 నిష్పత్తిలో, 60 రోజుల వయసులో ఇమిడాక్లోప్రిడ్ నీరు 1:20 నిష్పత్తిలో పూయాలి.

**వరిలో యాసంగి రకాలు తెలపండి.**

– సైదయ్య, తిప్పర్తి

సమాధానం: శీతల (డబ్ల్యుజీఎల్ 283) సన్న పొడువు బియ్యం గింజ రకం ఎర్రమల్లెలు (డబ్ల్యుజీయల్ 20471) తల్లికోడు నీటి ఎద్దడిని తట్టుకుంటుంది. (జేజీఎల్ 17004) ఉల్లికోడు అగ్గి తెగులును తట్టుకుంటుంది. (ఎన్ఎల్ఆర్ 34499) అగ్గి తెగులును సమర్ధంగా తట్టుకుంటుంది. ఇది సన్న గింజ రకం.

- త్రిపురారం, న్యూస్‌టుడే



కంపసాగర్ కేవీకే పీసీ శ్రీనివాసరావు

రైతులు వాట్సప్ ద్వారా అడిగే సమస్యలకు, సందేహాలకు కంపసాగర్ కేవీకే ఉద్యాన విభాగం శాస్త్రవేత్త శ్రీనివాసరావు సమాధానాలు ఇస్తారు. ఫోన్ నంబర్: 77025 44771

# ఆదరిస్తే.. ప్రగతి కాంతులు..!

★ నేడు 'అంతర్జాతీయ గ్రామీణ మహిళా దినోత్సవం'

పట్టు గొమ్మల్లాంటి పల్లెల్లో నివసిస్తున్న మహిళలు వ్యవసాయంలో రాణిస్తూ.. దేశాభివృద్ధికి తమ వంతు కృషిచేస్తున్నారు. స్థానిక వనరులను వినియోగించుకొన్న కొందరు ఆర్థికంగా, సామాజికంగా అభ్యున్నతి సాధిస్తున్నారు. సమాజంలో వేళ్లూనుకుపోయిన మూఢ నమ్మకాలు, నిరక్షరాస్యత కారణంగా చాలా మంది గ్రామీణ మగువలు ఇంకా వెనుకబడే ఉన్నారు. వారి కోసం ప్రభుత్వాలు అనేక పథకాలు, కార్యక్రమాలు అమలుపరిస్తే పల్లెఖ్యాతి విస్తరిస్తుంది. గ్రామాల్లో అభివృద్ధి కాంతులు వెల్లివిరుస్తాయి. పల్లెటూరి అతివల సాధికారతకు ఏటా అక్టోబరు 15న నిర్వహిస్తున్న 'అంతర్జాతీయ గ్రామీణ మహిళా దినోత్సవం' సందర్భంగా 'న్యూస్‌టుడే' కథనం

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

### చట్టసభల్లో సగమెప్పుడో..?

రాజకీయంగా చైతన్యం తీసుకొస్తే గ్రామీణ మహిళలు అభ్యున్నతి సాధిస్తారు. అందుకే ప్రభుత్వాలు స్థానిక సంస్థ ఎన్నికల్లో రాజకీయంగా మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించింది. కీలక నిర్ణయాలు తీసుకునే సమావేశాల్లో మహిళా ప్రతినిధులకు బదులుగా వారి భర్తలు, కుమారులు పెత్తనం చెలాయిస్తుండటంతో అనుకున్న లక్ష్యం నెరవేరడంలేదు. దీంతో గ్రామాలను దాటి చట్టసభలకు అడుగు పెట్టే మహిళలు కరవయ్యారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 12 నియోజకవర్గాలు ఉండగా.. కేవలం ఒక్కరే మహిళా ఎమ్మెల్యే ఉండటం అందుకు నిదర్శనం.



### పరిశ్రమలు వికసిస్తే..

మహిళల ఆర్థికాభ్యున్నతికి ప్రభుత్వం సమభావన సంఘాల ఏర్పాటు చేసి రుణాలు మంజూరు చేస్తోంది. ఆ రుణాలను సద్వినియోగం చేసుకున్న అతివలు కుట్టు, మగ్గం పని, బ్యూటీపార్లర్, పాల సేకరణ, కిరాణ దుకాణాలు, తినుబండారాల తయారీ వంటి రంగాల్లో రాణిస్తున్నారు. వారితోపాటు మరికొందరికి ఉపాధి చూపుతున్నారు. దీన్ని స్ఫూర్తిగా తీసుకొని పరిశ్రమల్లో గ్రామీణ మహిళలను భాగస్వాములను చేయాలి.



### అతివలే అత్యధికం..

నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో మొత్తం మహిళా ఓటర్లు 11,34,305 మంది ఉన్నారు. పురుషులకంటే అతివలు 22,817 మంది ఎక్కువగా ఉన్నారు. సూర్యాపేట జిల్లాలో 11,778 మంది, నల్గొండ జిల్లాలో 9,067 మంది, యాదాద్రి జిల్లాలో 1,972 మంది మహిళలు అధికంగా ఉన్నారు.

### మరో నలుగురికి ఉపాధి

గాలిదేవర రాణి, శ్రీనివాసనగర్, మిర్యాలగూడ మండలం



2009లో నా భర్త రహదారి ప్రమాదంలో మరణించారు. ఇద్దరు కుమారుల భవిష్యత్తు కోసం 2010లో రూ.30వేలు, 2014లో రూ.50వేల రుణంతో రెండు గేదెలు కొని పాల విక్రయం ప్రారంభించాను. కంపసాగర్‌లోని కృషి విజ్ఞానకేంద్రంలో చిరుధాన్యాల వంటకాలపై శిక్షణ పొంది.. రూ.రెండున్నర లక్షల రుణంతో ఆహార పదార్థాల తయారీ యంత్రాలు కొనుగోలు చేశాను. ప్రస్తుతం నెలకు రూ.20వేల ఆదాయం పొందుతూ మరో నలుగురికి ఉపాధి కల్పిస్తున్నాను.

### నారీమణులు ఎదుగుతున్నారిలా..

❒ మిర్యాలగూడలో నివసిస్తున్న వేములపల్లి మండలం అన్నపురెడ్డిగూడెం గ్రామానికి చెందిన చల్లమల సందీపారెడ్డి చేతితో అలంకరణ వస్తువులు తయారు చేస్తూ మూడు గిన్నిస్ రికార్డులు సాధించారు.

❒ అనుముల మండలం హజారిగూడెం గ్రామస్థురాలు షేక్ జాహెదాబేగం ఐదు డిగ్రీలు, మూడు పీజీలు, పీహెచ్‌డీ చేశారు. లక్షా వంద పేజీల ప్రపంచంలోనే అతి పెద్ద గ్రంథం రూపకల్పనలో కీలకంగా వ్యవహరించి గిన్నిస్ బుక్ రికార్డు సాధించారు.

❒ కోదాడ మండలం తొగర్రాయి గ్రామానికి చెందిన మౌనిక పట్టుదలతో చదివి ఎస్సై ఉద్యోగం సాధించి గ్రామీణ మహిళలకు ఆదర్శంగా నిలిచారు.

# జాతీయ రహదారిపై బారులు తీరిన వాహనాలు

చౌటుప్పల్, న్యూస్‌టుడే: హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారి-65 పై కార్లు, ఇతర వాహనాలు సోమవారం మధ్యాహ్నం నుంచి బారులు తీరాయి. దసరా పండగకు సెలవులు ఇవ్వడంతో హైదరాబాద్‌లో నివాసముంటున్న వారు పండగను సొంతూళ్లలో బంధుమిత్రులతో నిర్వహించుకునేందుకు పెద్ద సంఖ్యలో వారం క్రితం తరలి వచ్చారు. సెలవులు ముగిసి మంగళవారం నుంచి విద్యాలయాలు తెరుచుకోనున్నందున పిల్లలతో కలిసి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. దీంతో తెలుగు రాష్ట్రాలకు వారధిలాంటి ఈ జాతీయ రహదారికి వాహనాల కళ వచ్చింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సాధారణంగానే ఉన్న వాహనాల రద్దీ సాయంత్రానికి బాగా పెరిగింది. ఒకదాని వెంట ఒకటిగా కార్లు, ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు ప్రవాహంలాగా హైదరాబాద్ వైపు పరుగులు తీశాయి. పంతంగి టోల్ ప్లాజా దాటే సమయంలో వాహనదారులు నిరీక్షించాల్సి వచ్చింది. అక్కడి నుంచి చౌటుప్పల్ పట్టణం దాటేంత వరకు వాహనాలు నెమ్మదిగా ముందుకు కదిలాయి. ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బందులు ఏర్పడకుండా సివిల్, ట్రాఫిక్ పోలీసులు, టోల్ సిబ్బంది చర్యలు తీసుకున్నారు.



చౌటుప్పల్‌లో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వెళ్తున్న కార్లు

# మూడు రోజుల పోలీస్ కస్టడీకి అనుమతి

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: ప్రభుత్వ భూమిని నిబంధనలకు విరుద్ధంగా ఇతరుల పేర్ల మీదకు మార్చిడి, రైతుబంధు నిధులు కాజేశారన్న కేసులో అరెస్టయిన గత హుజూర్‌నగర్ తహసీల్దార్ జయశ్రీ, ధరణి ఆపరేటర్ జగదీశ్‌ను పోలీస్ కస్టడీకి అనుమతిస్తూ కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. తహసీల్దార్ జయశ్రీ, ఆపరేటర్ జగదీశ్‌లను విచారణ నిమిత్తం మూడు రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ సోమవారం పోలీసులు పిటిషన్ వేశారు. మరోవైపు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ జయశ్రీ, జగదీశ్ వేసిన పిటిషన్‌ను న్యాయస్థానం డిస్మిస్ చేసి వారిని మూడు రోజుల పోలీస్ కస్టడీకి అనుమతించింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ షకీల్ అహ్మద్ అన్సారి తెలిపిన వివరాల ప్రకారం.. ఇద్దరినీ మూడు రోజులు పోలీస్ కస్టడీకి అనుమతించాలని కోరుతూ సీఐ చరమందరాజు పిటిషన్ వేశారు. హుజూర్‌నగర్ న్యాయమూర్తి సెలవులో ఉండటంతో కోదాడ కోర్టులో పిటిషన్ వేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం జయశ్రీని, జగదీశ్‌లను మూడు రోజుల కస్టడీకి అనుమతిస్తూ ఆదేశాలు జారీ చేసింది. కోర్టు అనుమతితో ఈనెల 11న తహసీల్దార్ జయశ్రీని ఒక రోజు పోలీసులు విచారించిన సంగతి తెలిసిందే.

# బుద్ధుడి బోధనలు ఆచరిస్తే ప్రపంచ శాంతి

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: నేడు ప్రపంచంలో నెలకొని ఉన్న పరిస్థితులు మారాలంటే బుద్ధుడి బోధనలు తప్పకుండా పాటించాలని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం సాగర్‌లోని బుద్ధవనంలో నిర్వహించిన దమ్మ విజయం దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాడు రాజ్యాధికారం కోసం యుద్ధం చేసినప్పుడు జరిగిన పరిస్థితులను చూసిన అశోకుడు శాంతిని బోధించే బౌద్ధమతాన్ని స్వీకరించారని ఆయన అనుసరించిన మార్గాన్ని అందరూ పాటిస్తే ప్రపంచం మొత్తం శాంతిగా ఉంటుందన్నారు. హైదరాబాద్ నుంచి సాగర్ వరకు ఉన్న ప్రదేశాలను సంస్థ కారిడార్‌గా చేయాలని, హైదరాబాద్ నుంచి సాగర్‌కు ప్యాకేజీగా ఏర్పాటు చేసి ప్రతి రోజు బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని పర్యాటక అభివృద్ధి సంస్థకు సూచించారు. పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రితో చర్చించి బుద్ధవనాన్ని ప్రపంచంలోనే గొప్ప థీమ్‌పార్కుగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కోటిరెడ్డి, పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాశ్‌రెడ్డి, బుద్ధవనం ఓఎస్డీ సుధన్‌రెడ్డి, సబ్‌కలెక్టర్ అమిత్ నారాయణ్, కౌన్సిలర్ మంగ్తా నాయక్, ఈమని శివనాగిరెడ్డి, సూర్యప్రకాష్‌రావు, శ్యాంసుదర్, మహేంద్రహిల్స్‌లోని మహాబోధి బుద్ధవిహార్, మైసూర్ బైలాకుప్పెలోని మహాబోధి బుద్ధవిహార్ నుంచి వచ్చిన బౌద్ధ భిక్షువులు, హైదరాబాద్‌లోని కేంద్రీయ విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.



బుద్ధుడి పాదుకల వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, పర్యాటక సంస్థ ఛైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, తదితరులు

# శుభ ముహూర్తాలొచ్చేస్తున్నాయ్..!



యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: మూడు నెలల మూడాలు ముగిసి శుభకార్యాలకు తెర తొలిగే రోజులు సమీపిస్తున్నాయి. పెళ్లి బాజా భజంత్రీలతో సహా బరాత్‌ల మోత మోగనుంది. మరో మూడు నెలలు మంచి ముహూర్తాలు ఉన్నాయని, యాదాద్రి క్షేత్రంలోని ప్రధానాలయ పూజారులు, పంచాంగకర్తలు, బ్రాహ్మణ పూజారులు చెబుతున్నారు. వివాహ సంబంధాలు కుదుర్చుకునే క్రతువులు అంటే.. పెళ్లి చూపులు, సంబంధం ఒప్పందం, మాటాముచ్చట్లు ముమ్మరమయ్యాయి. వచ్చే నెల 3 నుంచి శుభ ఘడియలు మొదలై, 20 వరకు పన్నెండు శుభముహూర్తాలున్నట్లు పండితులు చెబుతున్నారు.

**కార్తిక మాసం..** దీపావళి సంబరాలయ్యాక నవంబరు(కార్తీక మాసం)లో 3వ తేదీ రాత్రి వేళ. 7న ఉదయం, రాత్రి, 8న ఉదయం, 10వ తేదీ ఉదయం, రాత్రి, 13న ఉదయం 14న ఉదయం, 17న మూడు వేళల్లో, ఇక 20న ఉదయం మంచి ముహూర్తాలున్నాయి.

★ వచ్చే డిసెంబరు(మార్గశిరం) నెలలో 4, 5, 6, 11, 20, 25 తేదీల్లో వివాహ బంధాలకు శుభాశీస్సులు ఉన్నాయి.

**మాఘ మాసంలో..** వచ్చే ఏడాది జనవరి (మాఘమాసం)లో 31న ఉదయం, రాత్రి రెండు ముహూర్తాలున్నాయి. ఫిబ్రవరి 2, 7 తేదీల్లో ఉదయం, రాత్రి, 13న ఉదయం, 14న రాత్రి, 16న మూడు వేళల్లో ముహూర్తాలున్నాయి. 20న రెండు, 22, 23 తేదీల్లో కూడా రెండేసి ముహూర్తాలున్నాయి.

**ఫాల్గుణంలో..** వచ్చే మార్చి 2వ తేదీన ఉదయం రెండు, రాత్రి రెండు ముహూర్తాలు. 6వ తేదీన మూడు వేళల్లో కల్యాణ ఘడియలు ఉన్నట్లు పంచాంగకర్తలు, ప్రధాన పూజారి లక్ష్మీనరసింహాచార్య, విశ్రాంత పురోహితులు బుచ్చయ్యశర్మ తెలిపారు.

# విష్ణుపురం స్టేషన్.. ఇక రైల్వే జంక్షన్!

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: గుంటూరు-నడికుడి మార్గంలో నల్గొండ జిల్లా సరిహద్దులో ఉన్న విష్ణుపురం రైల్వేస్టేషన్‌ను 'రైల్వే జంక్షన్'గా మార్చాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. 20 వేల మెగావాట్ల సామర్థ్యంతో దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద రాష్ట్రంలోనే అతిపెద్ద 'యాదాద్రి థర్మల్ ప్లాంటు'ను నిర్మిస్తుండగా దీనికి సమీపంలో ఉన్న విష్ణుపురం స్టేషన్‌ను జంక్షన్‌ని చేయాలని అధికారులు ప్రతిపాదించారు. యాదాద్రి థర్మల్ ప్లాంటుకు నిత్యం 21 రైల్వే వ్యాగన్లలో కరీంనగర్ రామగుండం నుంచి బొగ్గు రవాణా చేయాల్సి ఉంటుంది. జాన్‌పహాడ్ మార్గంలో ప్రస్తుతం ఉన్న రైల్వే లైనుకు అదనంగా మరోలైను నిర్మిస్తున్నారు.

◆ సాధారణంగా మూడు మార్గాలు కలిసే స్టేషన్‌ను జంక్షన్‌గా మార్చుతారు. గుంటూరు-బీబీనగర్ రైల్వే లైను ఇప్పటివరకు ఒకే మార్గంగా ఉండగా ప్రస్తుతం రెండు వరసలుగా విస్తరిస్తున్నారు. మిర్యాలగూడ గుంతకల్లు రైల్వే లైను సైతం ఏర్పాటు చేయాలని రైల్వేశాఖ నిర్ణయించడంతో విష్ణుపురం స్టేషన్‌లో మరింత రద్దీ పెరిగే అవకాశం ఉంది.



నల్గొండ జిల్లా సరిహద్దులో ఉన్న విష్ణుపురం రైల్వే స్టేషన్

గుంటూరు, జాన్‌పహాడ్ లైను, వీర్లపాలెం యాదాద్రి థర్మల్ ప్లాంటు రైలుమార్గాలు ఇక్కడ కలుస్తుండగా జంక్షన్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ప్రస్తుతం రైల్వే లైన్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నందున జంక్షన్‌కు అవసరమైన విద్యుత్తు, రైల్వే సురక్షిత సౌకర్యాలు కల్పిస్తున్నారు.

◆ భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా నియంత్రించే 'కవచ్' విధానం సైతం ఇక్కడ ఏర్పాటు చేసేలా సన్నాహాలు చేస్తున్నారు. యాదాద్రి థర్మల్ ప్లాంటుకు ఐదు కిలోమీటర్ల మేరకు రైల్వే లైను ఏర్పాటు చేస్తుండగా దీనికి అనుసంధానంగా జంక్షన్‌లో అవసరమైన పనులు జరిపించాలని నిర్ణయించినట్లు రైల్వే ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

## ఉమెన్ సాఫ్ట్‌బాల్ ఆసియాకప్ పోటీలకు ఎంపిక

బీబీనగర్, న్యూస్‌టుడే: బీబీనగర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ సైనిక శిక్షణ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్‌లకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ సోమవారం ప్రకటనలో తెలిపారు. బీఏ తృతీయ సంవత్సర విద్యార్థిని గుగులోతు మమత యూనివర్సిటీ ఉమెన్ సాఫ్ట్‌బాల్ ఆసియాకప్-2024కు ఎంపికయ్యారని వెల్లడించారు. ఈ నెల 15 నుంచి 19 వరకు చైనాలో జరిగే పోటీల్లో మమత పాల్గొంటారని వెల్లడించారు.



మమత

★ మరో విద్యార్థిని(ఎంపీసీ మొదటి సంవత్సరం) రుక్మిణి ఖేలో ఇండియా సౌత్‌జోన్ నేషనల్ ఖోఖో టోర్నమెంట్‌కు నల్గొండ జిల్లా నుంచి ఎంపికైనట్లు తెలిపారు. తమిళనాడులోని కోయంబత్తూరులో ఈ నెల 15 నుంచి 17 వరకు జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్‌లకు ఎంపికైన గుగులోతు మమత, కె.రుక్మిణిని ప్రిన్సిపల్, కళాశాల అధ్యాపక బృందం అభినందించారు. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణించి కళాశాలతో పాటు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు.



రుక్మిణి

# విద్యుత్తుశాఖలో భారీగా బదిలీలు

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే: దక్షిణ ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ నల్గొండ సర్కిల్ పరిధిలో పెద్ద సంఖ్యలో ఉద్యోగుల బదిలీలు జరిగాయి. అటెండర్ మొదలుకొని డీఈ స్థాయి కేడర్ వరకు స్థానచలనం కల్పించారు. ఒకే స్థానంలో రెండేళ్ల పాటు సర్వీసు ఉన్న వారిని పరిగణనలోకి తీసుకుని 11 కేడర్లల్లో 50 శాతం ఉద్యోగులను బదిలీ చేయాలని సంస్థ ఇది వరకే షెడ్యూల్ విడుదల చేసిన విషయం తెలిసిందే. వాస్తవానికి ఈ నెల 6వ తేదీన బదిలీల ఉత్తర్వులు వెల్లడి కావాల్సి ఉంది. ఉద్యోగ సంఘాల ప్రతినిధులు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో వాయిదా పడింది.

**బదిలీలు ఇలా..** తాజాగా ఆదివారం అర్ధరాత్రి కార్పొరేట్ కార్యాలయం నుంచి ఏఈ, ఏడీఈ, డీఈలను బదిలీ చేస్తూ ఉత్తర్వుల ప్రతులను ఆయా అధికారులకు వ్యక్తిగతంగా అందించారు. అందులో నల్గొండ డీఈ వెంకటేశ్వర్లును బదిలీ చేసి వెయిటింగ్‌లో పెట్టారు. స్టోర్ ఏడీఈ నాగిరెడ్డి హైదరాబాద్‌కు, నల్గొండ రూరల్ ఏడీఈ సత్యనారాయణ సూర్యాపేట స్టోర్‌కు బదిలీ అయ్యారు. వారి స్థానంలో నల్గొండ డీఈగా అన్నయ్య హైదరాబాద్ నుంచి పదోన్నతిపై, భువనగిరి డీఈ రవిప్రసాద్‌ను నల్గొండ ఎంఆర్టీ విభాగానికి (ఇన్‌ఛార్జి ఎస్ఈ నల్గొండ), మిర్యాలగూడ డీఈగా సుధీర్‌కుమార్, నల్గొండ స్టోర్ ఏడీఈగా శంకరయ్యయాదవ్, హాలియా ఏడీగా తిరపతయ్య, నల్గొండ రూరల్ ఏడీఈగా బల్యానాయక్, ఖర్చుల విభాగం ఏఓగా రవికృష్ణ, నల్గొండ టీఆర్ఈ ఏడీఈగా శ్రీనివాస్ రెడ్డి, నల్గొండ స్టోర్ ఏఈగా వెంకటేశం నిర్మాణం విభాగం డీఈ బి.వెంకటయ్య బదిలీపై వచ్చారు. వీరితోపాటు మరి కొంత మంది ఏఈ, ఏడీఈలు బదిలీ అయ్యారు. సోమవారం సర్కిల్ కార్యాలయ పరిధిలోని ఉద్యోగులతోపాటు నల్గొండ, దేవరకొండ, మిర్యాలగూడ డివిజన్ స్థాయిలో అసిస్టెంటు లైన్‌మెన్ నుంచి లైన్ ఇన్‌స్పెక్టర్ల స్థాయి వరకు సుమారు 350 మంది ఉద్యోగులకు స్థాన చలనం కల్పించారు. కొంత మంది అధికారులు బదిలీ ఉత్తర్వులు అందిన వెంటనే సోమవారం బాధ్యతలు చేపట్టారు.

### పైరవీలకు పెద్దపీట..!..

విద్యుత్తుశాఖ పరిధిలో ఉద్యోగుల బదిలీల్లో పైరవీలకు పెద్దపీట వేసినట్లు ఉద్యోగ సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అధికారులు తిలోదకాలిచ్చారు. చేతులు తడిపిన వారికి కోరుకున్న చోట పోస్టింగ్ ఇచ్చారని, సెక్షన్ నుంచి మరో సెక్షన్‌కు బదిలీ కావాల్సిన ఉద్యోగులను పనిచేస్తున్న సెక్షన్‌లోనే బదిలీ చేయడం, రెండేళ్ల సర్వీసు నిండని ఉద్యోగులకు సైతం స్థాన చలనం కల్పించడం అధికారులపై వస్తున్న అవినీతి ఆరోపణలకు బలం చేకూరుస్తోంది. అధికారుల తీరుపై కొంత మంది ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సైతం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.

# పురుగు మందు తాగి బలవన్మరణం

మునుగోడు, న్యూస్‌టుడే: పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడిన ఘటన మునుగోడు మండలం కచిలాపురంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జిట్టా ముత్తయ్య (55) వృత్తి రీత్యా వ్యవసాయ కుటుంబం. మద్యానికి బానిసైన ఆయన నిత్యం తాగి వస్తుండటంతో పలుమార్లు కుటుంబ సభ్యులు మందలించినా వదలడం లేదు. మద్యం తాగొద్దని చెబితే పురుగు మందు తాగి బలవన్మరణం చేసుకుంటానని ఇటీవల ఒక్కసారి బెదిరింపులకు గురి చేశారు. కనీసం సమయానికి తిండి తినకుండా మళ్లీ కొద్ది రోజులుగా నిత్యం మద్యం తాగుతుంటే ఆరోగ్యం క్షీణిస్తుందనే ఉద్దేశంతో తాగొద్దని మందలించడంతో మరోసారి బెదిరించేందుకు ప్రయత్నం చేశారు. సోమవారం తన వ్యవసాయ బావి వద్దకి వెళ్లి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. బావి వద్దకు వెళ్లిన వ్యక్తి ఇంటికి రాలేదని అనుమానంతో ఆయన భార్య అక్కడికి వెళ్లి చూడగా అప్పటికే అపస్మారక స్థితిలోకి వెళ్లారు. వెంటనే స్థానికుల సాయంతో మునుగోడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం 108లో నల్గొండ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడి భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫాంరేటు | 126–00 |
| రిటైల్ | 146–00 |
| డ్రెస్డ్ | 215–00 |
| స్కిన్‌లెస్ | 244–00 |

# నల్గొండ

•నల్గొండ •మునుగోడు •నకిరేకల్

## ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియామకం


వేముల రంజిత్

నల్గొండ లీగల్, న్యూస్‌టుడే: జిల్లా ప్రత్యేక పిల్లలపై నేరాల నిరోధక చట్ట నేరాల విచారణ న్యాయస్థాన (పోక్సో చట్టం) ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా జిల్లా కేంద్రానికి చెందిన న్యాయవాది వేముల రంజిత్ కుమార్‌కుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. ఈ మేరకు సోమవారం వేముల రంజిత్‌కుమార్ తన పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తులను ఇతర న్యాయవాదులను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయనను బార్ అధ్యక్షుడు సిరిగిరి వెంకటరెడ్డి అధ్యక్షతన న్యాయవాదులు సన్మానించారు. కార్యక్రమంలో బార్ కార్యదర్శి లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభ చాటాలి

మర్రిగూడ: గ్రామీణ ప్రాంత క్రీడాకారులు తమ ప్రతిభను చాటి పుట్టిన ఊరుకు గుర్తింపు తీసుకురావాలని భారస జిల్లా నాయకుడు చెరుకు లింగం గౌడ్ అన్నారు. ఇందుర్తి గ్రామంలోని యువతకు వాలీబాల్, క్రికెట్ కిట్లను సోమవారం పంపిణీ చేసి మాట్లాడారు. అశోక్, రము, గణేష్, హుస్సేన్, యాసిన్, శివ తదితరులు ఉన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) 80085 52710, 80085 66199, 8008574421, 80085 74385

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే:

? పట్టణంలో ఎన్టీఆర్‌కాలనీ గౌడ భవనం ఎదురుగా రోడ్డు గుంతల మయంగా మారింది. మరమ్మతులు చేయాలని. – సత్తయ్య, నల్గొండ.

✔ పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేయిస్తాం. – అశోక్, డీఈ, నల్గొండ పురపాలిక.

## అలుగుబెల్లికి మద్దతు ఇవ్వాలి: టీఎస్‌యూటీఎఫ్


నకిరేకల్: ఓటు నమోదు ఫారాలు అందజేస్తున్న టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు నర్సింహమూర్తి

నకిరేకల్, న్యూస్‌టుడే: వరంగల్- ఖమ్మం- నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డికి మరోసారి మద్దతు ఇవ్వాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి యాట మధుసూదన్‌రెడ్డి కోరారు. నకిరేకల్ ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ప్రిన్సిపాళ్లు డా. బెల్లి యాదయ్య, చామల ఉదయశ్రీ, అధ్యాపకులకు ఎమ్మెల్సీ ఓటు నమోదు ఫారాలను సోమవారం అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ నకిరేకల్ మండల శాఖ అధ్యక్షుడు టి.నర్సింహమూర్తి, ప్రతినిధులు కె.శ్రీనివాస్, జి.భద్రయ్య, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపకార వేతనాలు విడుదలకు డిమాండ్

నాంపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, బోధన రుసుం బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీజేవైఎం మండల అధ్యక్షుడు నాంపల్లి సతీష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయిలు విడుదల చేయకుంటే బీజేవైఎం ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామన్నారు.

నల్గొండ విద్యావిభాగం: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేసి ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలతో చర్చలు జరిపి సమ్మె విరమింపచేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయకార్యదర్శి ఖమ్మంపాటి శంకర్ డిమాండ్ చేశారు. సోమవారం నల్గొండలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల పరిధిలోని ప్రైవేట్ కళాశాల యజమాన్యాలు సమ్మెనోటీసు ఇచ్చినా ప్రభుత్వం స్పందించలేదన్నారు. ఆకారపు నరేశ్, స్పందన, పావని, కిరణ్, నవదీప్, సాయి, జలేందర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులు

నకిరేకల్, న్యూస్‌టుడే: పండగకు సొంతూర్లకు వచ్చిన వారు తిరిగి వెళుతున్నందున ప్రయాణికుల రద్దీ దృష్ట్యా నకిరేకల్ నుంచి హైదరాబాద్‌కు మంగళవారం ఉదయం ఐదు ప్రత్యేక బస్సులు నడపనున్నామని ఆర్టీసీ నకిరేకల్ కంట్రోలర్ ఎం.ఏ మన్నన్ సోమవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 6.30, 7, 7.30, 8, 8.30, 9 గంటలకు నకిరేకల్ బస్‌స్టేషన్ నుంచి బస్సులు హైదరాబాద్‌కు బయలుదేరుతాయని, ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## సంక్షిప్త సమాచారం

**రూ.లక్ష సాయం.. చిట్యాల:** చిట్యాల పురపాలికకు చెందిన చిత్రగంటి ప్రభాకర్ (35) ఆదివారం రాత్రి దాటిన తర్వాత గుండెపోటుతో మృతిచెందారు. సోమవారం ఆయన మృతదేహాన్ని ఎమ్మెల్యే వేముల వీరేశం, పురఛైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సందర్శించి నివాళి అర్పించారు. మంత్రి కోమటిరెడ్డి స్పందించి మృతుడి కుటుంబ సభ్యులకు సాయంగా రూ.లక్ష ప్రకటించారు. ఈ మేరకు నగదును పురఛైర్మన్ వెంకట్‌రెడ్డి అందజేశారు. కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి పోకల దేవదాసు, పాల్గొన్నారు.

**ఆటో యూనియన్ ఆధ్వర్యంలో.. చిట్యాల:** 9వవార్డుకు చెందిన మట్టిపల్లి నరసింహ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఆయన దశదిన కర్మను పురస్కరించుకుని చిట్యాల ఆటో యూనియన్ ఆధ్వర్యంలో రూ.12,500 పోగుచేసి నరసింహ కుటుంబానికి సోమవారం అందజేశారు. ఆ యూనియన్ అధ్యక్షుడు కుక్కల ముత్తయ్య, మునుకుంట్ల శ్రీను, ఆగు అశోక్‌యాదవ్, చింత సురేశ్, బరాల వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

**ఆర్థికసాయం అందజేత.. చిట్యాల గ్రామీణం:** వెలిమినేడు పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం పాలకవర్గ సభ్యుడు పైళ్ల నర్సిరెడ్డి అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. సంఘం తరఫున ఛైర్మన్ మారగోని యాదయ్య రూ.10వేలు ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. మల్లారెడ్డి, అంజయ్య, సూర్యప్రకాశ్‌రెడ్డి, నర్సింహ, శ్రీనివాస్‌రెడ్డి, వల్లభాయ్, చంద్రశేఖర్, కమ్మయ్య పాల్గొన్నారు.

**దేవాలయానికి విరాళం.. మర్రిగూడ:** యరగండ్లపల్లిలో గౌడ కులస్తుల ఆరాధ్యదైవం కంఠమహేశ్వర స్వామి దేవాలయం నిర్మాణం నిమిత్తం ఆ గ్రామానికి చెందిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాందాస్ శ్రీనివాస్ రూ.10 వేలు, అదే గ్రామానికి చెందిన నర్సిరెడ్డి, కృష్ణారెడ్డి రూ.55 వేలను విరాళంగా గుడి కమిటీ సభ్యులకు సోమవారం అందజేశారు.

**పరామర్శ.. నకిరేకల్:** అనారోగ్యానికి గురై చికిత్స అనంతరం ఇంటికి చేరుకున్న విశ్రాంత ఎంఈవో పోతుల మల్లయ్యను విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి బాదిని లింగయ్య, నకిరేకల్ అధ్యక్ష, కార్యదర్శులు వంటల రామలింగం, కందుల సోమయ్య సోమవారం పరామర్శించారు.

# కూచిపూడిలో ఆ అక్కాచెల్లెళ్ల రాణింపు

చిట్యాల, న్యూస్‌టుడే: పువ్వు పుట్టగానే పరిమళించునంటారు. చిన్నప్పటి నుంచి నాట్యకళ పై తమకున్న ఆసక్తిని గమనించి తల్లిదండ్రులు ప్రోత్సహించి, శిక్షణ ఇప్పించడంతో కూచిపూడి నాట్యంలో రాణిస్తున్నారు పట్టణానికి చెందిన అక్కాచెల్లెళ్లు. చింతపల్లి కృష్ణయ్య, మంజుల దంపతుల ముగ్గురు కూతుళ్లలో రెండో కూతురు హసిని, మూడో కుమార్తె రమణిక. హాసిని ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం, రమణిక ఎనిమిదో తరగతి చదువుతున్నారు. వీరు రవీంద్రభారతి, త్యాగరాయ గానసభ, శ్రీశైలం, పాలకొల్లు క్షీరారామం, ముచ్చింతల్ సమతామూర్తి తదితర వేదికల్లో వివిధ సందర్భాల్లో ప్రదర్శనలు ఇచ్చారు.

### నాట్య గురువుగా స్థిరపడాలని ఉంది: చింతపల్లి హాసిని



రెండో తరగతిలో ఉన్నప్పుడే నా ఆసక్తిని గమనించి హైదరాబాద్‌లో కూచిపూడిలో శిక్షణ ఇప్పించారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి కూచిపూడి నాట్యంలో సర్టిఫికెట్ కోర్సులో ఉత్తీర్ణత సాధించాను. నా చదువును కొనసాగిస్తూనే కూచిపూడిలో డిప్లొమా ఎంఏ, పూర్తిచేసి నాట్య గురువుగా స్థిరపడాలని సంకల్పించుకున్నాను. 2021లో హైదరాబాద్‌లో నిర్వహించిన నాట్యప్రదర్శన పోటీల్లో 'అచీవర్ అవార్డు'ను అందుకున్నా. 2022లో మహారాష్ట్రలోని శిర్డీ సాయి ఆలయ ప్రాంగణంలో 'బాబా నృత్యహారతి' పేరుతో నిర్వహించిన ప్రదర్శనలో చూపిన ప్రతిభకుగాను 'నాట్య శిఖామణి' పురస్కారం అందుకున్నా. సెప్టెంబరులో ప్రపంచ రికార్డు కోసం నిర్వహించిన ప్రదర్శనలో భాగస్వామినయ్యా. అదే ఏడాదిలో హైదరాబాద్‌లో జరిగిన పోటీల్లో పాల్గొని 'ప్రతిభ పురస్కారం' అందుకున్నా. 2023లో ఇచ్చిన ప్రదర్శనకు 'నాట్య మంజీర' పురస్కారాన్ని కైవసం చేసుకున్నా.

### అక్క స్ఫూర్తితో..: చింతపల్లి రమణిక



అక్క హాసిని నాట్యం చేస్తుంటే చూసి స్ఫూర్తిపొందాను. 2022 నుంచి ఆళ్వాలపాడు 'హైదరాబాద్‌లోని శ్రీ రాధాకృష్ణనాట్యాలయం'లో కూచిపూడి నాట్యంలో శిక్షణ తీసుకుంటున్నాను. శాస్త్రీయ సంగీత ప్రదర్శనల్లోనూ పాల్గొంటున్నాను. 2023లో సత్యసంగీత ఇంటర్నేషనల్ సంస్థ నిర్వహించిన పోటీలో పాల్గొని 'నాట్య మంజీర' పురస్కారం గెలుచుకున్నా. ఈ ఏడాది మే నెలలో హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని 'ఎక్సలెన్స్' సర్టిఫికెట్‌ను అందుకున్నా. అదే నెలలో హైదరాబాద్‌లో కూచిపూడి నాట్యసమ్మేళనంలో పాల్గొని 'నాట్య రత్న' పురస్కారాన్ని పొందా. చదువును కొనసాగిస్తూనే భవిష్యత్తులో శాస్త్రీయ సంగీతంలో రాణించాలన్నది నా కోరిక.

## జాతీయ రహదారిపై వాహనాల రద్దీ

కేతేపల్లి, న్యూస్‌టుడే: దసరా పండగ ముగించుకొని గ్రామాల నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ప్రయాణికులతో సోమవారం 65వ నెంబరు జాతీయ రహదారి కిక్కిరిసి పోయింది. కొర్లపహాడ్ గ్రామశివారులో ఉన్న టోల్‌ప్లాజా వద్ద ఉన్న ఆరు లైన్లలో వాహనాలు బారులు తీరాయి. దీంతో మరో లైన్‌ను హైదరాబాద్ వైపునకు వెళ్లే వాహనాలను అనుమతించారు. వాహనదారులకు ఎలాంటి


కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద బారులు తీరిన వాహనాలు..

ఇబ్బందులు తలెత్తకుండా టోల్‌ప్లాజా సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. మంగళవారం ఉదయం కూడా రహదారిపై వెళ్లే వాహనాల సంఖ్య భారీగానే ఉంటుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. రహదారిపై ప్రమాదాలు జరుగకుండా పోలీసులు ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహించారు.

## ప్రతి బూత్‌లో భాజపా సభ్యత్వ నమోదు చేపట్టాలి


మర్రిగూడలో భాజపా సభ్యత్వం అందజేస్తున్న సభ్యత్వ ప్రముఖ్ వీరేందర్ గౌడ్

నీలగిరి, న్యూస్‌టుడే: ప్రతి బూత్‌లో భాజపా సభ్యత్వ నమోదు పెంచాలని సభ్యత్వ నమోదు ప్రముఖ్ వీరేందర్‌గౌడ్ సూచించారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక మర్రిగూడలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలని సూచించారు. బూత్ స్థాయి నుంచి సభ్యులను చేర్పించడానికి పార్టీ నాయకులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వీరెల్లి చంద్రశేఖర్, బీసంగి జగ్గీవరన్, మిర్యాల వెంకటేశం, ముత్తే, చంటి, బద్దం నగేశ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్: పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం క్షేత్రస్థాయిలో ఉత్సాహంగా కొనసాగుతోందని భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి నూకల వీరేందర్‌గౌడ్ చెప్పారు. నకిరేకల్‌లో విలేకరుల సమావేశంలో సోమవారం మాట్లాడారు. ప్రధాని మోదీ నాయకత్వంపై ప్రజల్లో నమ్మకం ఉండటం వల్లే వారు ఉత్సాహంగా పార్టీలో చేరేందుకు ముందుకు వస్తున్నారన్నారు. జిల్లాలో 2 లక్షల సభ్యత్వాలు నమోదు చేయాలన్న లక్ష్యానికి చేరువలో ఉన్నామన్నారు. నకిరేకల్ నియోజకవర్గంలో 40వేల సభ్యత్వాల లక్ష్యం కాగా 60వేల వరకు చేరుకోనుందన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాది నిండకముందే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందన్నారు. కార్యక్రమంలో భాజపా ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నకిరేకంటి మొగులయ్య, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మండల వెంకన్న, మండలశాఖ అధ్యక్షుడు యానాల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు చెనగాని రాములు, చిరిని జానీ, బ్రహ్మచారి రవిశంకర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: ప్రధాని మోదీ పాలనతీరును భాజపా కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి టి.వీరేందర్‌గౌడ్ సూచించారు. చిట్యాల పురపాలికలో సోమవారం నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో చిట్యాలశాఖ అధ్యక్షుడు కూరెళ్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గంజి గోవర్ధన్, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మాస శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అమ్మవారి శోభాయాత్ర


మర్రిగూడ: అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు


నకిరేకల్: దుర్గామాత అమ్మవారి నిమజ్జన శోభాయాత్రలో భక్తులు

మర్రిగూడ, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని కన్యకా పరమేశ్వరీ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి శోభాయాత్రను చూడముచ్చటగా కోలాటాలతో వివిధ వేషధారణలతో గుర్రపు బండిపై అంగరంగ వైభవంగా ఊరేగించారు. బాలికలు ఒకే రకమైన వేసిన వేషధారణ ధరించి కోలాట ప్రదర్శన గ్రామస్థులను ఎంతగానో ఆకట్టుకుంది. రుమురాములు, శ్రీను, మురళి, మోహన్, రవి, శేఖర్, సత్యనారాయణ, బాలకృష్ణ పాల్గొన్నారు.

నకిరేకల్: నకిరేకల్ కనకదుర్గ ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం రాత్రి అమ్మవారి నిమజ్జన శోభాయాత్రను నిర్వహించారు. టీపీసీసీ పూర్వ కార్యదర్శి దైద రవీందర్, ఆలయ ఛైర్‌పర్సన్ బ్రహ్మదేవర పద్మావతి, కాంగ్రెస్ నాయకుడు పన్నాల రాఘవరెడ్డి, దర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు. కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

శాలిగౌరారం: దసరా పర్వదినం సందర్భంగా గ్రామాల్లో నెలకొల్పిన శ్రీ కనకదుర్గాదేవి శరన్నవరాత్రోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దుర్గామాల ధరించిన స్వాములు, భక్తులు సోమవారం అమ్మవారి శోభాయాత్ర ఘనంగా నిర్వహించి, శాలిగౌరారం ప్రాజెక్టులో నిమజ్జనం చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మాలధారణ స్వాములు, మహిళలు మంగళహారతులతో దేవిని దర్శించుకున్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం


వెలిమినేడులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలును వేగవంతంగా నిర్వహించేందుకు అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఎమ్మెల్యే వేముల వీరేశం కోరారు. నకిరేకల్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో చీమలగడ్డ, తాటికల్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ప్రారంభించి మాట్లాడారు. అవకతవకలకు పాల్పడినా, రైతులను ఇబ్బందులకు గురిచేసిన అధికారులు వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దారు జమీరొద్దీన్, పీఏసీఎస్ ఛైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు, సీఈవో జగన్‌మోహన్‌రెడ్డి, డైరెక్టర్ నకిరేకంటి నరేందర్, టీపీసీసీ ప్రతినిధి ఏసుపాదం, నాయకులు చౌగోని శ్రీను, కొండయ్య, కేంద్రం ఇంఛార్జిలు నాగరాజు, సైదులు పాల్గొన్నారు.

చిట్యాల: చిట్యాలలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వేముల వీరేశం ప్రారంభించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు సుంకరి మల్లేశ్‌గౌడ్, డైరెక్టర్లు నర్రా మోహన్‌రెడ్డి, జగిని భిక్షంరెడ్డి, పురఛైర్మన్ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

చిట్యాల గ్రామీణం: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. వెలిమినేడులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. డీఎస్‌వో వెంకటేశ్వర్లు, ఎంపీడీవో జయలక్ష్మి, ఏవో గిరిబాబు, పీఏసీఎస్ ఛైర్మన్ రఘుమారెడ్డి పాల్గొన్నారు.

కట్టంగూరు: ధాన్యం విక్రయించుకుని మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే వీరేశం కోరారు. కట్టంగూరులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని మాట్లాడారు. మాజీ జడ్పీటీసీ సభ్యులు నర్సింహ, యాదగిరి, తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో జ్ఞానప్రకాశ్, సీఈవో మల్లారెడ్డి పాల్గొన్నారు.

శాలిగౌరారం: కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని సరైన గిట్టుబాటు ధర పొందాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శాలిగౌరారం పీఏసీఎస్, గురజాలలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే


శాలిగౌరారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సామేల్

ప్రారంభించి మాట్లాడారు. తహసీల్దార్ యాదగిరి, పీఏసీఎస్ ఛైర్మన్ తాళ్లూరి మురళీ, ఏఎంసీ కార్యదర్శి చీనా నాయక్, ఏపీఎం జానకి పాల్గొన్నారు

కనగల్: పీఏసీఎస్ ఆధ్వర్యంలో లచ్చుగూడెం, చెట్లచెన్నారం గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ పద్మ ప్రారంభించారు. ఛైర్మన్ సహాదేవరెడ్డి, కార్యదిర్శ రామచంద్రారెడ్డి, శంకర్, ఏఆర్ఐ యాదగిరి పాల్గొన్నారు.

నాంపల్లి: పీఏసీఎస్ ఆధ్వర్యంలో నాంపల్లిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఛైర్మన్ గట్టుపల్లి నర్సిరెడ్డి ప్రారంభించారు. తహసీల్దార్ జి.దేవాసింగ్, ఏవో మల్లేశ్, మాల్ మార్కెట్ కమిటీ సభ్యులు ఆర్.అంజాచారి, పూల యాదగిరి పాల్గొన్నారు.

### అందుబాటులో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు: డీఆర్‌డీవో

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: రైతులకు అందుబాటులో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని వాటిని రైతులు ఉపయోగించుకొని మద్దతు ధర పొందాలని డీఆర్‌డీవో పీడీ శేఖర్‌రెడ్డి అన్నారు. నల్గొండ మండలం కొత్తపల్లిలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. ప్రతి రైతు నుంచి ఎకరాకు 32 క్వింటాళ్ల ధాన్యం మాత్రమే కొనుగోలు చేస్తామన్నారు. హమాలీ ఛార్జీ క్వింటాకు రూ.45 మాత్రమే రైతులు చెల్లించాలన్నారు. కొనుగోలు కమిటీ సూచనల మేరకు 40కిలోల 700 గ్రాములు మాత్రమే ధాన్యం తూకం వేయాలన్నారు. ఏపీడీ వినోద, ఏవో శ్రీనివాస్, మహిళసంఘం అధ్యక్షురాలు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పాముకాటుతో రైతు మృతి


గుడిపల్లి లింగారెడ్డి

మాడ్గులపల్లి, న్యూస్‌టుడే: పాముకాటుతో రైతు మృతిచెందిన ఘటన ఇందుగుల గ్రామ శివారులో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తి మండలం సిలార్మియాగూడెం గ్రామానికి చెందిన గుడిపల్లి లింగారెడ్డి(56) రోజు మాదిరిగానే ఆదివారం సాయంత్రం ఇందుగుల శివారులోని వ్యవసాయ పొలానికి వెళ్లారు. రాత్రి అయినా తిరిగి రాకపోవటంతో కుటుంబ సభ్యులు వెతికినా కన్పించలేదు. సోమవారం ఉదయాన్నే వ్యవసాయ బావి వద్ద పొలంలో కిందపడి ఉండటాన్ని స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అప్పటికే అతడు మృతి చెంది ఉన్నాడు. కాలు మడతలో రెండు గాట్లు పడి రక్తస్రావం జరిగి ఉంది. పాముకాటుతో మృతిచెందినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణయ్య తెలిపారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి ..

తిప్పర్తి: మళ్లేపల్లివారిగూడలో అద్దంకి-నార్కట్‌పల్లి రాష్ట్రీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కొత్త లింగయ్య(79) మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మళ్లేపల్లివారిగూడ గ్రామానికి చెందిన కొత్త లింగయ్య అద్దంకి-నార్కట్‌పల్లి రాష్ట్రీయ రహదారిని దాటుతుండగా మిర్యాలగూడ నుంచి నల్గొండ వైపు వెళుతున్న కారు ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన అతడిని వెంటనే నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ లింగయ్య ఆదివారం రాత్రి మృతిచెందారు. కుమారుడు కొత్త వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సాయి ప్రశాంత్ తెలిపారు.

## మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ ఆందోళన

నాంపల్లి, న్యూస్‌టుడే: అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన యువకుని కుటుంబానికి న్యాయం చేయాలంటూ బంధుమిత్రులు అనుమానిత వ్యక్తుల ఇంటి ఆవరణలో మృతదేహంతో ఆందోళనకు దిగారు. ఈ ఘటన సోమవారం రాత్రి నాంపల్లి మండలం చల్లవానికుంటలో చోటు చేసుకుంది. పోలీసులు, బంధువుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని చల్లవానికుంటలో రాపోతు మధు(21)ను గత నెల వినాయక నిమజ్జనం ఊరేగింపు సందర్భంగా జరిగిన ఘర్షణలో గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు అతనిపై చేయి చేసుకున్నారు. ఇటీవల అనారోగ్యానికి గురైన అతడు హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చేరి, చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. మరణోత్తర పరీక్షల పరీక్షల అనంతరం సోమవారం అంబులెన్స్‌లో గ్రామానికి తీసుకొచ్చిన మృతదేహాన్ని కిందకు దించనీయకుండా మూడు గంటల పాటు బంధువులు, స్నేహితులు అడ్డుకున్నారు. మధు మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకొని మృతుని కుటుంబానికి న్యాయం చేయాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం మృతదేహాన్ని అనుమానిత వ్యక్తి ఇంటి ఆవరణలో ఉంచి అర్ధరాత్రి వరకు ఆందోళన నిర్వహించారు. గ్రామంలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నాంపల్లి, కొండమల్లేపల్లి సీఐలు, చింతపల్లి, మర్రిగూడ, నాంపల్లి, కొండమల్లేపల్లి ఎస్సైలు, సిబ్బంది ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహిస్తున్నారు. కాగా మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టి నిందితులపై చర్యలు తీసుకొని, బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని నాంపల్లి సీఐ నవీన్‌కుమార్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

## జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు వైష్ణవి, చందన, రమ్యశ్రీ

నల్గొండ విద్యావిభాగం: నల్గొండ పట్టణంలోని మహాత్మా జ్యోతి బాపూలే సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు వైష్ణవి, చందన, రమ్యశ్రీ ఎంపికయ్యారు. ఇటీవల ఎన్జీ కళాశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎంపికలో ఈ విద్యార్థులు ప్రతిభ చాటి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. వీరిని సోమవారం ఆ పాఠశాలల ఆర్‌సీవో సంధ్యారాణి అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కోరారు. జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ చాటి జిల్లాకు పేరు తీసుకరావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉమ, సంధ్యారాణి, ఇందిర, నరేశ్, నాగేంద్ర, ఉపాధ్యాయులు అభినందించారు.

కనగల్, న్యూస్‌టుడే: ఈనెల 16 నుంచి 18 వరకు తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరు నిర్వహించే జాతీయస్థాయి ఖేల్ ఇండియా ఖోఖో పోటీలకు మండల కేంద్రంలోని అక్కేనపల్లి వెంకటేశ్వరావు ఆదర్శ పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని తాటికొండ పల్లవి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ తామస్, పీడీ ఐతగోని విజయ్ తెలిపారు. ఇటీవల నల్గొండ ఎన్జీ కళాశాల గ్రౌండ్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల ఎంపికలో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు వారు తెలిపారు. ఈసందర్భంగా పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.


విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపల్, పీడీ

## క్రీడా..తేజం


తేజస్వినిని అభినందిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్గొండ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: నేటి అమ్మాయిలు కేవలం చదువులకే పరిమితం కాకుండా క్రీడల్లో రాణిస్తూ సత్తా చాటుతున్నారు. క్రీడల్లో వస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. ఎంచుకున్న క్రీడలో నిత్య సాధనతో పోటీల్లో పాల్గొని బహుమతులు...పతకాలు సాధిస్తూ ప్రశంసలు పొందుతున్నారు. నల్గొండ పట్టణానికి చెందిన కందుల వెంకటరమణగౌడ్, భార్గవి దంపతుల కుమార్తె కందుల తేజస్వినిగౌడ్ వెయిట్ లిఫ్టింగ్ క్రీడలో అదరగొడుతోంది. ఒకవైపు ఐఏఎస్ అకాడమీలో చదువుకుంటూనే..మరోవైపు క్రీడల్లో తన ప్రత్యేతను చాటుతోంది. ఈ యువతి తాజాగా హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ జిల్లాల అండర్-19 వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 120 కేజీల విభాగంలో ప్రథమ బహుమతి (ఛాంపియన్ షిప్) సాధించింది. ఆయా జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో తేజస్వినిని అత్యుత్తమ ప్రతిభతో తొలి ఛాంపియన్‌షిప్ సాధించి ఔరా అనిపించుకుంది. జాతీయస్థాయి పోటీల్లో రాణించాలనే పట్టుదలతో కోచ్ రఘు పర్యవేక్షణలో నిరంతరం సాధన కొనసాగిస్తున్నట్లు ఈ క్రీడాకారిణి పేర్కొంటుంది. భవిష్యత్తులో ఒలింపిక్స్‌లో దేశానికి పతకం సాధించడమే ధ్యేయంగా ముందుకు సాగనున్నట్లు తెలిపింది. రాష్ట్రస్థాయి ఛాంపియన్‌షిప్ సాధించిన తేజస్వినిని సోమవారం జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అభినందించారు.

## క్రీడల్లోనూ ఆదర్శం


క్రీడలో ప్రతిభ కనబర్చిన విద్యార్థికి ప్రశంస పత్రం అందజేస్తున్న ప్రిన్సిపల్ థామస్

కనగల్ ,న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాలకు చెందిన విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహం, నిరంతర సాధనతో జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో పాల్గొననున్నారు.. ఇటీవల ముగిసిన రాష్ట్ర స్థాయి ఖోఖో క్రీడలో విద్యార్థులు తమ ఆట తీరుతో పలువురు ఆకట్టుకున్నారు. క్రమశిక్షణ, నిత్యసాధనతో తమ ప్రతిభకు మరింత మెరుగులు దిద్దుకుంటున్నారు.

### అమ్మానాన్నల ప్రోత్సాహం..

కొర్వీ శివ, తొమ్మిదో తరగతి



ఖోఖో క్రీడపై మక్కువతో నిత్యం సాధన చేస్తూ జిల్లా స్థాయిలో రాణిస్తున్నా. గత నెలలో జరిగిన ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి సబ్ జూనియర్ ఖోఖో ఎంపిక పోటీలో పాల్గొని ప్రతిభ కనబరిచా. హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. తల్లిదండ్రులు, మిత్రుల ప్రోత్సాహంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యేలా ఇప్పటి నుంచే పూర్తి స్థాయిలో సన్నద్ధమవుతున్నా.

### జాతీయ జట్టులో ఆడటమే లక్ష్యం..

కె.గౌతమ్, తొమ్మిదో తరగతి



దామరచర్ల మండలో జరిగిన సబ్ జూనియర్ ఖోఖో ఎంపిక పోటీల్లో పాల్గొని ఉత్తమంగా రాణించి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యా. జాతీయ స్థాయిలో పాల్గొనడం తన లక్ష్యం. అందుకు నిత్యం వ్యాయామ ఉపాధ్యాయుడి సూచనలు, సలహాలు తీసుకుంటూ ముందుకెళ్తున్నా.

## డీఈవోను కలిసిన టీఆర్‌టీఎఫ్ నాయకులు

నల్గొండ విద్యావిభాగం: టీఆర్‌టీఎఫ్ నాయకులు డీఈవో భిక్షపతిని కలిశారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. టీఆర్‌టీఎఫ్ జిల్లా నూతన ప్రధానకార్యదర్శిగా నియమితులైన తరాల పరమేశ్ యాదవ్‌కు డీఈవో శుభాకాంక్షలు తెలిపారు. మారెడ్డి అంజిరెడ్డి, జనార్ధన్, మల్లయ్య, సైదులు, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

### సినిమాలు

నల్గొండ కల్చరల్, నకిరేకల్, న్యూస్‌టుడే

నల్గొండ: **నటరాజ్:** దేవర, **తిరుమల:** వేట్టయన్, **వెంకటేశ్వర:** మార్టిన్, **పీవీఎన్:** మా నాన్న సూపర్ హీరో

నకిరేకల్: **రామకృష్ణ**- వేట్టయన్, **వెంకటేశ్వర**- దేవర

# మిర్యాలగూడ

•మిర్యాలగూడ •నాగార్జునసాగర్ •దేవరకొండ

## నాగులచెర్వు శిఖం భూముల సర్వే

దామరచర్ల, న్యూస్‌టుడే: దామరచర్ల మండల కేంద్రంలోని నాగులచెరువు శిఖం భూములపై నీటి పారుదల, రెవెన్యూ అధికారులు సోమవారం సంయుక్తంగా సర్వే నిర్వహించారు. హద్దులను గుర్తించి కొలతలు వేశారు. భూముల ఆక్రమణపై ప్రస్తుతస్థితిని గుర్తించి ప్రభుత్వానికి నివేదిస్తామని అధికారులు వెల్లడించారు. శిఖం భూములు సుమారు 95ఎకరాలు ఉండగా అందులో ప్రస్తుతం నార్కట్‌పల్లి-అద్దంకి నాలుగువరుసల రహదారి, రైల్వేమార్గం, ఖబరస్థాన్ తదితర నిర్మాణాలు సేకవ చెర్వు బఫర్‌జోన్‌లో ఉన్నట్లు సమాచారం. సర్వే ఆఫ్ ల్యాండ్స్ ఏడీ ఎం.శ్రీనివాస్, ఇరిగేషన్ ఈఈ లక్ష్మణ్‌నాయక్, డీఈ జనార్దన్, తహసీల్దార్ జవహర్‌లాల్, ఆర్ఐ సురేందర్ సింగ్, ఇందిర, మాలు పాల్గొన్నారు.

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

? పట్టణంలోని తాళ్లగడ్డ ఇందిరమ్మ కాలనీలో సీసీ రహదారులు, పక్క కాల్వలు లేక అనేక అవస్థలు పడుతున్నాం. – శ్రీనివాస్, మిర్యాలగూడ

✔ సీసీ రహదారులు, పక్క కాల్వల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తాం. – ఎండీ యూసుఫ్, పుర కమిషనర్, మిర్యాలగూడ

**మేమున్నాం.. మీకు తోడుగా..** (10 AM TO 1 PM) 77994 92939 99121 74975 98487 81656

చింతపల్లి, న్యూస్‌టుడే:

? మండలంలోని వెంకటేశ్వరనగర్‌లోని పలు కాలనీల్లో 20 రోజులకు పైగా చెత్త సేకరించే ట్రాక్టర్ రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. – శ్రీరాములు, వెంకటేశ్వరనగర్

✔ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. – జర్పుల పద్మ, పంచాయతీ కార్యదర్శి, గొడుకొండ్ల

దేవరకొండ, న్యూస్‌టుడే:

? దేవరకొండ పట్టణంలో దోమలు విపరీతంగా ఉండడం వల్ల సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నాయి. ఫాగింగ్ చేపట్టాలి. – జానయ్య, దేవరకొండ

✔ ఫాగింగ్ వార్డుల వారీగా చేపడుతున్నాం. తప్పనిసరిగా అన్ని వార్డుల్లో నిర్వహిస్తాం. – శంకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

## చోరీలు ఆరాతీసి.. సూచనలు ఇచ్చి..

గుర్రంపోడు, న్యూస్‌టుడే: నల్గొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ సోమవారం గుర్రంపోడు పోలీసుస్టేషన్ తనిఖీ చేశారు. ఇటీవల జరుగుతున్న పలు ఘటనల కేసుల పురోగతిపై ఆయన సీఐ ధనుంజయని అడిగి తెలుసుకున్నారు. ముల్కలపల్లి హత్యోదంతం నుంచి వైన్స్‌షాపులో దొంగతనం ఘటనలపై దర్యాప్తు తీరును అడిగి తెలుసుకున్నారు. పోలీసుస్టేషన్‌కు వచ్చిన పలువురిని పలకరించి సమస్యలకు సంబంధించిన వినతి పత్రాలను అందుకున్నారు. ఆయన వెంట డీఎస్పీ గిరిబాబు ఉన్నారు.



గుర్రంపోడు పోలీసుస్టేషన్‌లో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్రపవార్

## అపరిశుభ్రం.. రోగాలమయం

దేవరకొండ, న్యూస్‌టుడే: దేవరకొండ డివిజన్‌లో విషజ్వరాలు చాపకింద నీరులా విస్తరిస్తున్నాయి. పల్లె, పట్టణాల్లో దోమల దండయాత్ర చేస్తుండటంతో విషజ్వరాలు ప్రబలుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. పురపాలికలో అపరిశుభ్రతతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.



దేవరకొండ ప్రభుత్వాసుపత్రిలో రోగులు

### తల్లడిల్లుతున్న ప్రజలు

పీఏపల్లి, దేవరకొండ మండలాల్లో చికెన్ గన్యా విస్తరిస్తుంది. ఈ జ్వరం వచ్చిన వారు మోకాళ్లు, కాళ్ల నొప్పులతో మంచానికి పరిమితమవుతున్నారు. నడవలేక వారం నుంచి నెల వరకు దీనావస్థను ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది. డివిజన్‌లోని తొమ్మిది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల రోగులు, పురపాలిక రోగులకు దేవరకొండ ఏరియా ఆసుపత్రి ఎక్కువగా వైద్య చికిత్సల కోసం వెళ్తుండడంతో అక్కడ బారులతో ప్రజలు తల్లడిల్లుతున్నారు. వైద్యులు ఎప్పుడొస్తారని గంటల కొద్దీ ఎదురు చూస్తున్నారు. పురపాలికల్లో, పల్లెల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. దేవరకొండ పట్టణంలో ఏ వీధిలో చూసినా పందులు, దోమలు, చెత్తచెదారంతో చిన్నపిల్లలు జ్వరాల బారిన పడుతున్నారు. పందులను పట్టణానికి దూర ప్రాంతానికి తరలించడంతో పాటు ప్రతి వీధిలో ఫాగింగ్ చేపట్టాలని అధికారులకు ఫిర్యాదులు వస్తున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

### పరిశుభ్రత చర్యలు చేపడుతున్నాం:

భాస్కర్‌రెడ్డి, కమిషనర్



దేవరకొండ పురపాలికలో పరిశుభ్రత చర్యలు చేపడుతున్నాం. పందుల నివారణకు వాటి యజమానులతో సమావేశాల ఏర్పాటు చేస్తాం. వీధుల్లో ఫాగింగ్ చేపడుతున్నాం.



ఉత్సవ విగ్రహంగా ఫాగింగ్ యంత్రం

### ఏడాదిగా ప్రారంభానికి నోచుకోని వైనం..

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: 'దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించని చందంగా మారింది మిర్యాలగూడ మండలం జప్తివీరప్పగూడెం గ్రామంలోని ఆరోగ్య ఉపకేంద్రం భవనం పరిస్థితి. జాతీయ ఆరోగ్య మిషన్ నిధులు రూ.20 లక్షలతో నూతన భవనం నిర్మాణం పూర్తి చేసి ఏడాది అవుతున్నప్పటికీ ప్రారంభించకపోగా అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది జనవరి 30న ప్రారంభోత్సవానికి శిలాఫలకం ఏర్పాటు చేసినప్పటికీ ఇప్పటి వరకు ప్రారంభించలేదు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి భవనాన్ని రోగులకు అందుబాటులోకి తీసుకురావాలని గ్రామాల వాసులు కోరుతున్నారు.



జప్తివీరప్పగూడెం గ్రామంలో నిర్మాణం పూర్తైన ఆరోగ్య ఉపకేంద్రం




2012-13 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు, అప్పటి ఉపాధ్యాయులు

## చిన్ననాటి స్మృతులు.. మధుర జ్ఞాపకాలు

దామరచర్ల, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని శ్రీవిద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో 2012-13 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సోమవారం స్థానిక బాలాజీ ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా ఒకచోట చేరి పాఠశాలలో చదివిన నాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. అనంతరం తమకు పాఠాలు బోధించిన, విద్యా బుద్ధులు నేర్పిన గురువులను శాలువాలు, మెమొంటోలతో సత్కరించారు. ఉపాధ్యాయులు జి.రామకృష్ణారెడ్డి, డి.ఇంద్రసేనారెడ్డి, చంద్రశేఖర్, సత్యనారాయణ, శ్రీను, డి.చంద్రశేఖర్, పూర్వ విద్యార్థులు రవి, నవీన్, శ్రీకాంత్, కోటేశ్వరరావు, మహేష్, భవాని, సుచరిత, సాహితి, లావణ్య ఉన్నారు.

## 16న మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం

నిడమనూరు, న్యూస్‌టుడే: నిడమనూరు మార్కెట్ కమిటీ నూతన ఛైర్మన్ పాలకవర్గ సభ్యుల ప్రమాణస్వీకారం బుధవారం ఉదయం నిడమనూరు బాలాజీ ఫంక్షన్‌హాల్‌లో జరుగుతున్నట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అంకతి సత్యం తెలిపారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి, ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరవ్వాలని ఆయన పత్రిక ప్రకటనలో కోరారు.



మిర్యాలగూడ గాంధీనగర్‌లో అమ్మవారి ఊరేగింపులో..

## వైభవంగా అమ్మవారి శోభాయాత్ర

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: దసరా వేడుకల ముగింపు సందర్భంగా సోమవారం మిర్యాలగూడలోని గాంధీనగర్ కనకదుర్గ దేవాలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అమ్మవారి విగ్రహానికి శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. కేరళకు చెందిన డప్పు వాయిద్యకారులు, మహిళల కోలాట ప్రదర్శనలు, కళాకారుల విచిత్ర వేషధారణలతో నిర్వహించిన ప్రదర్శనలతో శోభాయాత్ర ఘనంగా సాగింది. ఆలయ కమిటీ, పుర అధ్యక్షుడు తిరునగరు భార్గవ్, రమేష్, మట్టయ్య, రాము పాల్గొన్నారు.

**డిండి:** డిండిలోని శ్రీ చెన్నకేశవ దేవాలయం, ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత శోభాయాత్ర సోమవారం వైభవంగా నిర్వహించారు. హనుమండ్ల కేశవులు, లక్ష్మినారాయణ, విజయ్‌కుమార్, శ్రీనివాసులు, కృష్ణ, మధు, భీమాచారి, శ్రీను పాల్గొన్నారు.

**దేవరకొండ:** పట్టణంలో కోలాటాలు, నృత్యాలతో గాంధీనగర్, గణేష్‌నగర్, బీఎన్ఆర్ కాలనీలో ఘనంగా దుర్గామాత శోభాయాత్ర జరిగింది.

**చింతపల్లి:** ఉప్పరపల్లిలో దుర్గామాత శోభాయాత్రలో భాగంగా అమ్మవారి చీరలకు వేలం పాట నిర్వహించారు. అమ్మవారి చీరను నేతాల చంద్రయ్య రూ.61 వేలకు, గుడ్డేటి పర్వతాలు కళశంను రూ.41 వేలకు, వడ్లకొండ రామయ్య ముక్కుపుడకను రూ.80 వేలకు, వడ్లకొండ వెంకటయ్య పైసల దండను రూ.23 వేలకు వేలం పాటలో దక్కించుకున్నారు.



దేవరకొండలో దుర్గామాత వద్ద శోభాయాత్రకు సన్నద్ధం అవుతున్న మహిళలు

**సినిమాలు** మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే

**రాఘవ:** దేవర, **వెంకటేశ్వర:** విశ్వం, **శ్రీనివాస:** వేట్టయన్

**విట్రోస్:** దేవర, వేట్టయన్, విశ్వం, జనక అయితే గనక, మార్టిన్

## 'రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం'

దేవరకొండ, న్యూస్‌టుడే: రైతు బిడ్డగా రైతు కష్టం తెలిసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతు సంక్షేమం కోసం అనేక పథకాలు చేపడుతున్నారని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. దేవరకొండ మండలం కొండభీమనపల్లి గ్రామంలో సోమవారం సన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతు రుణమాఫీ కాని వారు ఎవరూ అధైర్య పడొద్దని సాంకేతిక సమస్య ఉన్న వారి సమస్యలను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించేలా చూస్తానని హామీ ఇచ్చారన్నారు. ఆర్డీవో శ్రీరాములు, ఎంపీడీవో ఎస్.డి.డానియల్, తహసీల్దార్ సంతోష్ కిరణ్, డీటీసీఎస్ హన్మంతు శ్రీనివాస్‌గౌడ్, ఏడీఏ శ్రీలక్ష్మి, లోకసాని శ్రీధర్‌రెడ్డి, వెంకటయ్య పాల్గొన్నారు.



కొండభీమనపల్లిలో సన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

**త్రిపురారం:** మండంలోని మాటూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఎంపీడీవో విజయకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు వానాకాలంలో పండించిన ధాన్యాన్ని ఐకేపీ కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర పొందాలని కోరారు. ఏపీఎం అశోక్, సీసీలు దేవ్‌సింగ్, హేమనాయక్ రైతులు వెంకట్రామ్‌నాయక్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## పరామర్శ

పెద్దవూర, న్యూస్‌టుడే: పెద్దవూర మండల భారాస అధ్యక్షుడు జటావత్ రవినాయక్ మాతృమూర్తి అయిన జంక అకాల మృతిచెందడంతో ఆ కుటుంబాన్ని సోమవారం మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి పరామర్శించి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భారాస జిల్లా పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్, ఎమ్మెల్సీ ఎం.సి. కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, గాదరి కిషోర్, ట్రైకర్ మాజీ ఛైర్మన్ రాంచంద్రనాయక్, నాయకులు కృష్ణారెడ్డి, వివేక్‌రావు తదితరులున్నారు.



పెద్దవూర రవినాయక్ తల్లి జంక చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

## ఎన్నికల హామీల అమలులో విఫలం: జగదీశ్‌రెడ్డి

**చింతపల్లి:** ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అన్నారు. సోమవారం దశరథమ్మ దశ దినకర్మకు హాజరై మాట్లాడారు. రైతులకు పూర్తి స్థాయిలో రైతుబంధు మాఫీ కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్ర కుమార్, పైళ్ల శేఖర్‌రెడ్డి, గాదరి కిషోర్, తదితరులు ఉన్నారు.

## దశరథమ్మ మృతి బాధాకరం: గుత్తా

చింతపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన భారాస రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్‌రెడ్డి తల్లి కంకణాల దశరథమ్మ మృతి బాధాకరమని శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. దశరథమ్మ అనారోగ్యంతో మృతి చెందటంతో సోమవారం జరిగిన దశ దినకర్మకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు నమ్మిన సిద్ధాంతం కోసం పని చేసినప్పుడే సమాజంలో మంచి గౌరవం ఉంటుందని అన్నారు. భారాస మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, శ్రీనివాస్, భాస్కర్, నిరంజన్‌గౌడ్, జోగయ్య పాల్గొన్నారు.



దశరథమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

**నివాళి...** మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: మిర్యాలగూడ పట్టణానికి చెందిన భారాస నాయకుడు పద్మశెట్టి కోటేశ్వరరావు తల్లి నారాయణమ్మ ఇటీవల మృతి చెందగా.. సోమవారం పట్టణంలోని నివాసంలో ఏపీలోని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. వారి వెంట నల్లమోతు సిద్ధార్థ, నారాయణరెడ్డి, బాలాజీనాయక్, లలిత, హాతీరాం, పూనాటి లక్ష్మినారాయణ, పోలు నాగార్జున తదితరులు ఉన్నారు.

## గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

మిర్యాలగూడ గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని దొండవారిగూడెం గ్రామ సమీపంలో నాగార్జునసాగర్ ఎడమకాల్వలో ఆదివారం గల్లంతైన వెంకటాచారి మృతదేహం సోమవారం లభ్యమైంది. గ్రామీణ ఎస్సై పి.లోకేష్ వెల్లడించిన వివరాల ప్రకారం.. దసరా పండగ వేళ బంధువులతో కలిసి ఈత సరదా కోసం వెళ్లి పొడకంటి వెంకటాచారి నీటి ప్రవాహంలో మునిగి గల్లంతయ్యారు. భార్య పొడకంటి సుష్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని వెతగ్గా సోమవారం సాయంత్రం సూర్యాపేట జిల్లా పొనుగోడు గ్రామ సమీపంలోని ఎడమ కాల్వ నీటిపై తేలుతున్న మృతదేహం కనిపించటంతో బయటికి తీసి మిర్యాలగూడ ప్రాంతీయాసుపత్రికి తరలించామని పోలీసులు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

డిండి, న్యూస్‌టుడే: నంద్యాల జిల్లా సున్నిపెంటకు చెందిన సయ్యద్ కరీముల్లా కారులో హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా డిండి పీహెచ్‌సీ ఆసుపత్రి ఎదుట రోడ్డుపై నిలిచిన లారీని వెనుక నుంచి కారు ఢీకొట్టింది. దీంతో డ్రైవర్ సయ్యద్ కరీముల్లాకు గాయాలయ్యాయి. వెంటనే కల్వకుర్తి ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఫిర్యాదు అందలేదని ఎస్సై రాజు తెలిపారు.

## రద్దీగా రహదారి

చింతపల్లి, న్యూస్‌టుడే: హైదరాబాద్-నాగార్జునసాగర్ హైవే రహదారి వాహనాల రద్దీ పెరిగి పోవడంతో అటు వ్యాపారులు, ఇటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. విజయ దశమి సందర్భంగా పట్టణ ప్రాంతాల నుంచి గ్రామాలకు వచ్చిన వారు తిరిగి పండగ ముగియడంతో పట్టణాలకు బయలుదేరారు. వేలాది వాహనాల రాకపోకలతో హైవే రహదారి రద్దీగా మారింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి సైతం ఈ ప్రాంతం నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండటంతో మరింత రద్దీ పెరిగింది.



మిర్యాలగూడ శాంతినికేతన్ డిగ్రీ కళాశాల ఎదుట అధ్యాపకుల నిరసన

## డిగ్రీ కళాశాలల నిరవధిక బంద్.. అధ్యాపకుల నిరసన

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: మూడేళ్లు ప్రభుత్వం డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థుల ఫీజురీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవటానికి నిరసనగా మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ, పీజీ కళాశాలలు సోమవారం నుంచి నిరవధిక బంద్ చేపట్టారు. దసరా సెలవుల అనంతరం సోమవారం తరగతులు ప్రారంభించాల్సి ఉండగా కళాశాల యాజమాన్యాలు తెలంగాణ వ్యాప్తంగా నిరవధిక బంద్ చేయాలని నిర్ణయించగా జిల్లాలోని అన్ని కళాశాలలు బంద్ పాటించాయి. పట్టణంలోని శాంతినికేతన్, విజేత డిగ్రీ కళాశాలల ఎదుట అధ్యాపకులు నిరసన తెలిపారు. ప్రభుత్వం సకాలంలో రీయింబర్స్‌మెంట్ చెల్లించి విద్యార్థులను ఆదుకోవాలన్నారు. శ్రీనివాస్, శ్రీనివాసరెడ్డి, రత్నకుమార్, వీరారెడ్డి, కోలారామస్వామి, రమేష్, హరినాథ్, హుస్సేన్, రాజు, సంతోష్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**చింతపల్లి:** బకాయిలో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రభుత్వం విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ డివిజన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్ షంషోద్దీన్ అన్నారు. సంవత్సరాల తరబడి ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో ప్రైవేట్ కళాశాలల నిర్వాహకులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. విద్యార్థులకు ధ్రువపత్రాలు అందించే సమయంలో విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు.

## రహదారిపై వేడుకలు.. రాకపోకలకు ఇబ్బందులు

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: నిత్యం రద్దీగా ఉండే మిర్యాలగూడలోని రాజీవ్‌చౌక్ వద్ద ప్రధాన రహదారి ఓ అధికార పార్టీ నాయకుడి పుట్టినరోజు వేడుకలతో ప్రజలు అనేక అవస్థలు పడ్డారు. డీజేతో పాటలు పెట్టి.. బాణసంచా కాలుస్తూ సదరు నాయకుడి అనుచరులు హల్‌చల్ చేశారు. నడి రోడ్డుపై వేడుకలు నిర్వహించడంతో నల్గొండ రహదారి, సాగర్ రహదారిపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయి వాహనదారులు, ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడ్డారు. డీజేకు అనుమతి లేదని పోలీసులు నిర్వాహకులు చెప్పడంతో.. అధికార పార్టీ నాయకులు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. అతి కష్టం మీద డీజే వాహనాన్ని పోలీసులు స్టేషన్‌కు తరలించారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు ఒకటో, రెండో పట్టణ సీఐలు కరుణాకర్, నాగార్జున, ఎస్సైలు సుధీర్, రాంబాబు, ట్రాఫిక్ సిబ్బంది గంట పాటు శ్రమించాల్సి వచ్చింది. కాగా వేడుకల్లో నియోజకవర్గ ప్రజాప్రతినిధితో పాటు పార్టీ జిల్లా ప్రతినిధి సైతం పాల్గొన్నప్పటికీ ప్రజల ఇబ్బందులను పట్టించుకోకపోవడం విమర్శలకు తావిచ్చింది. కాగా అనుమతి లేకుండా డీజే ఏర్పాటు చేసినందుకు యజమానితో పాటు వేడుకల నిర్వాహకులపై కేసు నమోదు చేయనున్నట్లు రెండో పట్టణ సీఐ నాగార్జున తెలిపారు.



మిర్యాలగూడ: రాజీవ్‌చౌక్ వద్ద నిర్వహిస్తున్న పుట్టినరోజు వేడుకలు



రోడ్డు మధ్యలో పుట్టిన రోజు వేడుకలతో నిలిచి పోయిన ట్రాఫిక్

## సంక్షిప్త సమాచారం

**నేటి నుంచి పశువులకు టీకాలు.. త్రిపురారం:** మండలంలోని అన్ని గ్రామాల్లో అక్టోబరు 15 నుంచి నవంబరు 14 వరకు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలి కుంటు వ్యాధి టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల పశువైద్యాధికారి నరేంద్ర అన్నారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ టీకాల కార్యక్రమం ముగిసే వరకు మండల కేంద్రంలోని పశువైద్య శాల ఉదయం 12 గంటల వరకు మాత్రమే తెరచి ఉంటుందని చెప్పారు.

**మిర్యాలగూడ గ్రామీణం:** వాతావరణ మార్పుతో పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధి నివారణకు పంపిణీ చేస్తున్న ఉచిత టీకా మందుకు మండల పరిధిలోని 46 గ్రామపంచాయతీ పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారిణి డాక్టరు దుర్గారమాదేవి సోమవారం ప్రకటనలో తెలిపారు.

**ఎమ్మెల్సీగా గెలిపించుకుంటాం.. గుర్రంపోడు:** నల్గొండ, వరంగల్, ఖమ్మం ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా పీఆర్‌టీయూ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న పింగిలి శ్రీపాల్‌రెడ్డిని గెలిపించుకుంటామని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అద్దంకి సునీల్‌కుమార్ చెప్పారు. సోమవారం గుర్రంపోడులో ఆయన విలేకరులతో మాట్లాడారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు మహ్మద్ గౌస్, మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

**అనాథాశ్రమంలో అన్నదానం... మిర్యాలగూడ:** పట్టణంలోని ఫెయిత్ బంజారా అనాథాశ్రమంలో గర్మానాయక్, దానియేలు జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు సోమవారం అనాథలకు అన్నదానం చేసి దుస్తులు పంపిణీ చేశారు. హన్యానాయక్, రమాబాయి పాల్గొన్నారు.



అనాథ చిన్నారులకు అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

**మౌలిక వసతులు కల్పించండి.. దామరచర్ల:** కల్లేపల్లి బంగారుమైసమ్మ తల్లి దేవాలయం వద్ద పారిశుద్ధ్య పనులు చేపట్టడంతో పాటు మౌలిక వసతులు కల్పించాలని తెలంగాణా గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి డి.లింగానాయక్ సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. భక్తుల ద్వారా నెలకు రూ.10లక్షలకు పైగా ఆదాయం వస్తున్నప్పటికీ కనీస వసతులు లేవన్నారు.

**చెక్కుల పంపిణీ.. మిర్యాలగూడ పట్టణం:** మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని 130 మంది లబ్ధిదారులకు సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.38.60లక్షల చెక్కులను ఆయా మండలాల కాంగ్రెస్ నాయకుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాస్, అర్జున్, సైదులు, సిద్ధునాయక్, తదితరులు పాల్గొన్నారు.

**రక్తదాన శిబిరం.. మిర్యాలగూడ పట్టణం:** డీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలు పుట్టిన రోజు సందర్భంగా సోమవారం మిర్యాలగూడలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆయుష్మాన్‌భవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని బాలు ప్రారంభించారు. మొత్తం 32 మంది యువకులు రక్తదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. శేఖర్‌రెడ్డి, మోయిజ్, ఫయాజ్, షఫీ, మునీర్ పాల్గొన్నారు.

**అంబేడ్కర్‌కు నివాళి... దేవరకొండ:** డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ బౌద్ధమతాన్ని స్వీకరించిన రోజును పురస్కరించుకొని ఎమ్మార్పీఎస్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఆయన చిత్రపటానికి, విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు కంబాలపల్లి వెంకటయ్య మాట్లాడారు. పోతెం సహదేవుడు, భాస్కరాచారి, నర్సింహాచారి, సైదులు, వెంకటాచారి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

**నిందితులను కఠినంగా శిక్షించాలి... మిర్యాలగూడ పట్టణం:** వరంగల్ జిల్లాలో మహాత్మా జ్యోతిరావు పులే విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం మిర్యాలగూడలోని పులే విగ్రహానికి క్షీరాభిషేకం చేసి మాట్లాడారు. వెంకటేశ్వర్లు, సైదులు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

**అభినందనలు... దేవరకొండ:** దేవరకొండ మండలం మైనంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని బండమీదితండాకు చెందిన రైతు కూలీ గిరిజన పుత్రిక సపావత్ అఖిల ఎంబీబీఎస్ సీటు సాధించింది. నిరుపేద కుటుంబంలో జన్మించి అత్యున్నత వైద్య సీటు సాధించడంపై అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సందర్భంగా సోమవారం దేవరకొండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సాపావత్ అఖిలను ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ఘనంగా సన్మానించారు. పుర ఛైర్మన్ ఆలంపల్లి నర్సింహ, సిరాజ్‌ఖాన్, యూనుస్, పున్న వెంకటేశ్వర్లు, సీత్య నాయక్ ఉన్నారు.

**హామీలు నెరవేర్చాలి... వేములపల్లి:** మండల పరిధిలోని మొల్కపట్నం గ్రామంలో సోమవారం ఐద్వా మండల మహాసభ కార్యక్రమం నిర్వహించారు. ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి పాదూరి గోవర్ధన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. మహిళ భరోసా కింద ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. అనంతరం ఐద్వా మండల కమిటీని ఏర్పాటు చేయగా అధ్యక్షురాలిగా పాదిల లక్ష్మమ్మ, కార్యదర్శిగా అనిరెడ్డి మాధవిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందిరమ్మ, వీరమ్మ, నాగమ్మ, సైదమ్మ, లింగమ్మ, తదితరులు పాల్గొన్నారు.